

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 28-06-2026 | సంపుటి - 29 | సంచిక -36 | రూ : 4 | పేజీలు: 8




# వీబీ గ్రామ్ జీని అంగీకరించం

- రాష్ట్రాల అధికారాలను లాక్కునేందుకు కేంద్రం కుట్ర
- కర్నాటక, కేరళం రాష్ట్రంతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధం
- జులై 2న రాష్ట్ర క్యాబినెట్‌లో తుది నిర్ణయం
- మంత్రివర్గ ఉపసంఘం చైర్మెన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి

హైదరాబాద్ : వీబీ గ్రామ్ జీ చట్టం-2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం రెండో సమావేశం నిర్వహించారు. మంత్రులు దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరిస్తోందని విమర్శించారు. ఇది కేవలం ఉపాధి హామీ చట్ట సవరణ మాత్రమే కాదనీ, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా తగ్గించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు, తరువాయి 2లో

## ఫ్యూచర్ లేని సీఎం..
# ఫ్యూచర్ సిటీతో మోసం

- హిట్లర్ రెడ్డి చేతిలో రాష్ట్రం
- యాప్‌లో యూరియా లేదు..
- రంగారెడ్డి జిల్లా పేరు లేదు : బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్



మహేశ్వరం : ''ఫ్యూచర్ లేని సీఎం.. ఫ్యూచర్ సిటీ అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు.. పిచ్చోడి చేతిలో రాయి ఉంటే చుట్టుపక్కల ఉన్న వారికి నష్టం.. అదే పిచ్చోడి చేతిలో రాష్ట్రం ఉంటే నాలుగు కోట్ల ప్రజలకు నష్టం. ఇవాళ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నది ఓ హిట్లర్ రెడ్డి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం శనివారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌తోపాటు పార్టీ సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా పక్కా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వికాసం పోయింది.. విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలిందన్నారు. 'రైతు బంధు పోయింది.. రాహుల్ బంధు' వచ్చిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు పాతరేసి కుంభకోణాల జాతర నడుస్తోందని ఆరోపించారు. తెలంగాణలో ఉద్యమంలో మహేశ్వరం ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య ఓయూ వద్ద ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. యూరియాను యాప్‌లో పెడతామని, ఇప్పుడు యాప్ లో యూరియా కాదు కదా చివరికి రంగారెడ్డి జిల్లా పేరు లేదు.. మల్కాజ్‌గిరి పేరు లేకుండా చేశారని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ, తరువాయి 2లో

## ఢిల్లీలో భూకంపం..
# భయంతో రోడ్లపైకి జనం



- ఢిల్లీ, ఉత్తర భారతదేశంలో శనివారం సాయంత్రం భూప్రకంపనలు
- ఆఫ్ఘనిస్థాన్‌లో 6.2 తీవ్రతతో భూకంపం సంభవించినట్లు వెల్లడి
- భయంతో ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీసిన ప్రజలు

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ సహా ఉత్తర భారతదేశంలోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం బలమైన భూప్రకంపనలు చోటు చేసుకున్నాయి. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన ప్రజలు ఇళ్లు, కార్యాలయాల నుంచి ఒక్కసారిగా బయటకు పరుగులు తీశారు. కొన్ని సెకన్ల పాటు భూమి కంపించడంతో ఏం జరుగుతుందో తరువాయి 2లో



## 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన
# ప్రధాని మోదీ

- సెషెల్స్ పర్యటనలో ప్రపంచంలోనే అత్యంత వృద్ధ తాబేలుతో ప్రధాని మోదీ భేటీ
- 194 ఏళ్ల 'జొనాథన్' నివసిస్తున్న బొటానికల్ గార్డెన్స్ సందర్శన
- పర్యావరణ పరిరక్షణకు గుర్తుగా మొక్కను నాటిన ప్రధాని
- భారత్-సెషెల్స్ దౌత్య సంబంధాలకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ పర్యటన

2లో



## రీసెర్చ్ పేపర్ల రద్దు
# భారత్‌కు రెండో స్థానం

- ఉపసంహరణలో గ్లోబల్ టాప్ 10 జాబితాలో ఆరు భారత యూనివర్సిటీలు

## రెండేళ్లలో 500 నగరాలకు
# భారత్ ట్యాక్సీ సేవలు: అమిత్ షా

- గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన కేంద్రమంత్రి
- రాబోయే రెండేళ్లలో దేశంలోని 500కు పైగా నగరాలకు సేవలు విస్తరించనున్నట్లు ప్రకటన
- ఈ జులై 31 లోపు ఏడు ప్రధాన నగరాల్లో కార్యకలాపాలు ప్రారంభం కానున్నట్లు వెల్లడి
- డ్రైవర్లను భాగస్వాములుగా చేసే సహకార నమూనాతో ఈ ప్లాట్‌ఫామ్ పనిచేస్తుందన్న అమిత్ షా
- 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే ప్రధాని మంత్రాన్ని సాకారం చేస్తున్నట్లు వ్యాఖ్య

2లో




## పవన్, అనితలపై వ్యాఖ్యలు
# చంద్రబాబు ఆగ్రహం

- ప్రత్యర్థి పార్టీపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజం
- పవన్, అనితపై వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన సీఎం
- రాజధాని నిర్మాణాన్ని అడ్డుకునేందుకే వైసీపీ కుట్రలు చేస్తోందని ఆరోపణ
- వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యత తనదేనని స్పష్టం చేసిన చంద్రబాబు
- నదుల అనుసంధానంతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ



విజయవాడలో జరిగిన ఓ ఘటనకు కులం రంగు పులిమి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విమర్శలు చేయడం, హోంమంత్రి వంగలపూడి అనిత మేకప్‌పై అవమానకరంగా మాట్లాడటం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నానని సీఎం చంద్రబాబు అన్నారు. మహిళల మేకప్ గురించి మాట్లాడటానికి గొడ్డలి పార్టీ వారికి సిగ్గు అనిపించడం లేదని, పోలీసులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని, ఇవన్నీ చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. మార్కాపురం జిల్లా గిద్దలూరు నియోజకవర్గం కిష్టంశెట్టిపల్లెలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. వైసీపీ నేతలు అమరావతిపై కుట్ర చేయడానికే అక్కడికి వెళ్లారని, రాజధాని నిర్మాణాన్ని అడ్డుకునేందుకే రైతులను రెచ్చగొడుతున్నారని చంద్రబాబు ఆరోపించారు. "గొడ్డలి పార్టీ నిరంతరం కుట్రలు చేస్తూనే ఉంది. బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లు రాబందుల్లా వేచి ఉన్నాయి. రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ఆ పార్టీకి లేదు. దేవాలయాలపై దాడులు చేసిన వాళ్లే ఇప్పుడు గుళ్లకు వెళ్లి నాటకాలు ఆడుతున్నారు. వాళ్లవి పూర్తిగా క్రిమినల్ పాలిటిక్స్. ఇలాంటి వ్యక్తులతో ఆడబిడ్డలకు, సమాజానికి రక్షణ లేదు. వారు చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని బాగు చేయడానికి సుదీర్ఘ సమయం పడుతోంది" అని అన్నారు. గత పాలనలో రూ.10 లక్షల కోట్ల అప్పులు, వ్యవస్థల విధ్వంసంతో రాష్ట్రం నలిగిపోయిందని, ఇప్పుడు బీజేపీ, జనసేన, టీడీపీ కూటమిగా రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసే బాధ్యత తరువాయి 2లో

# వీబీ గ్రామ్ జీని అంగీకరించం

హైదరాబాద్ : వీబీ గ్రామ్ జీ చట్టం-2025ను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్. అంబేద్కర్ సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘం రెండో సమావేశం నిర్వహించారు. మంత్రులు దనసరి అనసూయ సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, గడ్డం వివేక్ వెంకటస్వామి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ పేదల జీవనోపాధికి వెన్నెముకగా నిలిచిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ రాష్ట్రాల అధికారాలను కేంద్రం హరిస్తోందని విమర్శించారు. ఇది కేవలం ఉపాధి హామీ చట్ట సవరణ మాత్రమే కాదనీ, భారత రాజ్యాంగంలోని సమాఖ్య స్ఫూర్తిపైనే జరుగుతున్న ప్రత్యక్ష దాడి అని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వాల అధికారాలను క్రమంగా తగ్గించి, గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను నిర్వీర్యం చేయాలనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల భవిష్యత్‌ను తాకట్టు పెట్టే చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయదని తేల్చి చెప్పారు. అవసరమైతే ఈ చట్టంపై సుప్రీంకోర్టులో సవాలు చేసే అంశాన్ని కూడా ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తోందని చెప్పారు. సమాఖ్య వ్యవస్థను విశ్వసించే ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. కర్నాటక, కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రులతో సంప్రదింపులు జరిపి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని అన్నారు. సమావేశంలో పాల్గొన్న 20 పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం స్వంత ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావాలని వారు సూచించారని చెప్పారు. 60 రోజుల ఉపాధి పరిమితిని పూర్తిగా వ్యతిరేకిస్తూ, ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల ఉపాధి కల్పించాలనీ, చట్టబద్ధ కనీస వేతనాలు చెల్లించాలని పౌరసంఘాలు ప్రభుత్వాన్ని కోరాయని మంత్రి వివరించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై వేల కోట్ల రూపాయల అదనపు భారాన్ని మోపే ప్రమాదం ఉందనీ, ఈ అంశాన్ని రాష్ట్ర న్యాయశాఖ క్షుణ్ణంగా పరిశీలిస్తుందని తెలిపారు. పనితీరు బాగున్న రాష్ట్రాలను శిక్షిస్తూ, వెనుకబడిన రాష్ట్రాలను ప్రోత్సహించేలా కేంద్రం రూపొందించిన నిధుల కేటాయింపు విధానం అన్యాయమన్నారు. ఈ అంశంపై జులై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. సమీక్షలో పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ డి.దివ్య తదితరులు పాల్గొన్నారు.

## పవన్, అనితలపై
# వ్యాఖ్యలు చంద్రబాబు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

కూడా తనపైనే ఉందని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు పునరావాసం కింద రైతులకు రూ. 300 కోట్లు అందించామని, త్వరలోనే మరో రూ.600 కోట్లు విడుదల చేస్తామన్నారు. వెలిగొండతో రెండు దశల్లో 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. "నదుల అనుసంధానమే రాష్ట్రాలకు శ్రీరామరక్ష. గోదావరి నుంచి కావేరి వరకు నీటిని తీసుకెళ్లి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం. ఈ విషయంలో ఎవరికీ కడుపు ఉబ్బరం అవసరం లేదు. రైతు ప్రయోజనాలే ముఖ్యం" అని సీఎం స్పష్టం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాతో పాటు రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చి దిద్దుతామని, రామాయపట్నం పోర్టును పూర్తి చేసి పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డీబీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలో 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలు: అమిత్ షా

రవాణా రంగంలో సహకార స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో 'భారత్ ట్యాక్సీ' దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించబోతోందని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. రాబోయే రెండు సంవత్సరాల్లో దేశంలోని 500కు పైగా నగరాలు, పట్టణాల్లో ఈ సహకార మొబిలిటీ ప్లాట్‌ఫామ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. నేడు గుజరాత్‌లో భారత్ ట్యాక్సీ సేవలను అధికారికంగా ప్రారంభించిన సందర్భంగా అమిత్ షా ఈ కీలక ప్రకటన చేశారు. గుజరాత్‌లోని అన్ని ప్రధాన నగరాల్లో టూ వీలర్లు, ఆటోరిక్షాలు, ఫోర్ వీలర్లు అనే మూడు విభాగాల్లోనూ భారత్ ట్యాక్సీ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయని అమిత్ షా తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా సేవలు అందిస్తున్న ఈ ప్లాట్‌ఫామ్, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పూర్తిస్థాయి కార్యకలాపాలు మొదలుపెట్టిందని వివరించారు. ఈ సంస్థ జాతీయ విస్తరణలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు అని ఆయన అభివర్ణించారు. విస్తరణ ప్రణాళికల గురించి వివరిస్తూ.. రాబోయే నెలల్లో దేశవ్యాప్తంగా భారత్ ట్యాక్సీ వేగంగా కార్యకలాపాలు ప్రారంభిస్తుందని ఆయన అన్నారు. "ఈ వేదిక నుంచి నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. రాబోయే ఏడాదిన్నర నుంచి రెండేళ్లలోపు, మేము 500కు పైగా నగరాలకు చేరుకుంటాం. దేశంలో సేవలు అందని ప్రదేశమంటూ ఉండదు" అని అమిత్ షా నొక్కి చెప్పారు. జులై 31వ తేదీలోగా నాగ్‌పూర్, పుణే, ముంబై, లక్నో, చండీగఢ్, జైపూర్, కోల్‌కతా వంటి ఏడు కీలక నగరాల్లో సేవలు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. భారత్ ట్యాక్సీ ప్రత్యేకత సహకార నమూనా అని అమిత్ షా తెలిపారు. ఇందులో డ్రైవర్లు కేవలం కాంట్రాక్టర్లుగా కాకుండా సంస్థలో వాటాదారులుగా, సభ్యులుగా ఉంటారని ఆయన స్పష్టం చేశారు. "ఇప్పటికే సుమారు ఏడు లక్షల మంది 'సారథులు' (డ్రైవర్‌సభ్యులు) భారత్ ట్యాక్సీ కుటుంబంలో భాగమయ్యారు. ఈ రోజు మీరు కూడా ఈ కుటుంబంలో చేరడం చాలా సంతోషంగా ఉంది" అని గుజరాత్‌లో కొత్తగా చేరిన సభ్యులను ఉద్దేశించి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన 'సహకారం ద్వారానే శ్రేయస్సు' అనే మంత్రాన్ని సాకారం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని అమిత్ షా పేర్కొన్నారు. మొబిలిటీ, రవాణా రంగాల్లో సహకార ఉద్యమాన్ని విస్తరించడమే తమ లక్ష్యమని ఆయన వివరించారు. భారత్ ట్యాక్సీలో చేరడం ద్వారా డ్రైవర్లు తమ శ్రేయస్సు, గౌరవం, భద్రతకు మార్గం సుగమం చేసుకున్నారని ఆయన అన్నారు. భవిష్యత్తులో భారత రవాణా రంగంలో భారత్ ట్యాక్సీ ఒక ప్రధాన సహకార సంస్థగా ఎదుగుతుందన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## ఢిల్లీలో భూకంపం
# భయంతో రోడ్లపైకి జనం

(మొదటిపేజీ తరువాయి)

తెలియక జనం ఆందోళన చెందారు. ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన 6.2 తీవ్రత కలిగిన భారీ భూకంపం కారణంగానే ఈ ప్రకంపనల వచ్చినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం శనివారం సాయంత్రం 7:04 గంటలకు ఈ భూకంపం సంభవించింది. ఆఫ్ఘనిస్థాన్‌లోని హిందూకుష్ ప్రాంతంలో, భూమికి 215 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూకంప ప్రభావంతో జమ్ముకశ్మీర్, ఢిల్లీ మరియు పరిసర ప్రాంతాల్లో భూమి స్పష్టంగా కంపించింది. బహుళ అంతస్తుల భవనాలు ఊగిపోవడంతో నివాసితులు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. పలుచోట్ల ప్రజలు ఖాళీ ప్రదేశాల్లో గుమిగూడిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వెలుగుచూశాయి. అయితే, ఈ భూప్రకంపనల వల్ల భారత్‌లో ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు స్పష్టం చేశారు.

# రీసెర్చ్ పేపర్ల రద్దు: భారత్‌కు రెండో స్థానం

అంతర్జాతీయ పరిశోధన రంగంలో అగ్రగామిగా ఎదగాలని ఆకాంక్షిస్తున్న భారత్‌కు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. పరిశోధన పత్రాల ఉపసంహరణ (రిట్రాక్షన్)లో అంతర్జాతీయ స్థాయిలో మన దేశం రెండో స్థానంలో నిలవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2025 సంవత్సరానికి సంబంధించి ప్రపంచవ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో పరిశోధన పత్రాలను వెనక్కి తీసుకున్న తొలి పది విశ్వవిద్యాలయాల జాబితాలో ఏకంగా ఆరు భారతీయ వర్సిటీలు ఉండటం గమనార్హం. ఈ వివరాలను 'రిట్రాక్షన్ వాచ్' డేటాబేస్ వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం, 2025లో చైనా 1,701 పరిశోధన పత్రాల ఉపసంహరణతో ప్రథమ స్థానంలో ఉండగా, భారత్ 887 రిట్రాక్షన్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిశోధనల్లో మన దేశం వాటా కేవలం 5 శాతమే అయినప్పటికీ, ఉపసంహరణల్లో మాత్రం 21 శాతం వాటాను కలిగి ఉండటం పరిశోధనల నాణ్యతా ప్రమాణాలపై పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ జాబితాలో చెన్నైలోని అన్నా యూనివర్సిటీ 161 రిట్రాక్షన్లతో అంతర్జాతీయంగా మొదటి స్థానంలో నిలిచింది. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం టెక్నికల్ యూనివర్సిటీ (160), సవీత ఇన్‌స్టిట్యూట్ (159) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ 104 రిట్రాక్షన్లతో ఐదో స్థానంలో నిలవగా, లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ 98 ఉపసంహరణలతో ఆరో స్థానంలో నిలిచింది. నాణ్యత ప్రమాణాలను విస్మరించి పరిశోధన పత్రాలను ప్రచురించడమే ఈ దుస్థితికి ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. పరిశోధనలో లోపాలు, అవాస్తవిక ఫలితాలు, కృత్రిమ మేధ (ఏఐ) వాడకం వంటి కారణాల వల్ల పలు జర్నళ్లు ఈ పత్రాలను తిరస్కరించాయి. ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించిన కేంద్ర ప్రభుత్వం, 2025 నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో రిట్రాక్షన్లకు పెనాల్టీలు విధించడం వంటి కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది.



# 194 ఏళ్ల 'జోనాథన్'ను కలిసిన ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన సెషెల్స్ పర్యటనలో ఒక ప్రత్యేక అతిథిని కలిశారు. ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయసు భూచర జీవిగా గిన్నిస్ రికార్డుల్లోకెక్కిన 'జోనాథన్' అనే తాబేలుతో ఆయన భేటీ అయ్యారు. సెషెల్స్ జాతీయ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మోదీ, ఈ సందర్భంగా అక్కడి జాతీయ బొటానికల్ గార్డెన్స్‌ను సందర్శించి ఈ అరుదైన జీవిని చూశారు. సుమారు 194 ఏళ్ల వయసున్న జోనాథన్, 1832లో జన్మించినట్లు అంచనా. ప్రస్తుతం వయసు రీత్యా కంటిచూపు మందగించడం, వాసన శక్తి తగ్గడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, అది ఆరోగ్యంగానే ఉంది. ఈ అల్డాబ్రా జాతికి చెందిన భారీ తాబేలు సెషెల్స్‌లో పర్యాటకులకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పర్యావరణ పరిరక్షణకు చిహ్నంగా బొటానికల్ గార్డెన్స్‌లో ఒక మొక్కను నాటారు. భారత్, సెషెల్స్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. సముద్ర భద్రత, బ్లూ ఎకానమీ, వాతావరణ మార్పుల నిరోధం వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడమే ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. దౌత్యపరమైన పర్యటనలో ఇలాంటి ఆసక్తికరమైన సంఘటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ భేటీకి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# ఫ్యూచర్ లేని సీఎం..ఫ్యూచర్ సిటీతో మోసం

మహేశ్వరం : "ఫ్యూచర్ లేని సీఎం.. ఫ్యూచర్ సిటీ అంటూ ప్రజలను మోసం చేస్తున్నారు.. పిచ్చోడి చేతిలో రాయి ఉంటే చుట్టుపక్కల ఉన్న వారికి నష్టం.. అదే పిచ్చోడి చేతిలో రాష్ట్రం ఉంటే నాలుగు కోట్ల ప్రజలకు నష్టం. ఇవాళ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నది ఓ హిట్లర్ రెడ్డి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల జనరల్ బాడీ సమావేశం శనివారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి కార్తీక్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఐఆర్‌తోపాటు పార్టీ సభ్యత్వ నమోదుపై పార్టీ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ జెండా పక్కా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వికాసం పోయింది.. విధ్వంసం, విషాదం మాత్రమే మిగిలిందన్నారు. 'రైతు బంధు పోయింది.. రాహుల్ బంధు' వచ్చిందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలకు పాతరేసి కుంభకోణాల జాతర నడుస్తోందని ఆరోపించారు. తెలంగాణలో ఉద్యమంలో మహేశ్వరం ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య ఓయూ వద్ద ప్రాణత్యాగం చేశారని గుర్తు చేశారు. యూరియాను యాప్‌లో పెడతామని, ఇప్పుడు యాప్ లో యూరియా కాదు కదా చివరికి రంగారెడ్డి జిల్లా పేరు లేదు.. మల్కాజ్‌గిరి పేరు లేకుండా చేశారని విమర్శించారు. అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ, పేరిట విలువైన భూములను దోచుకుంటు న్నారని ఆరోపించారు. సర్ కార్యక్రమాన్ని కార్యకర్తలు అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, నాయకులు గెల్లు శ్రీనివాస్, తీగల విక్రమ్ రెడ్డి, మహేశ్వరం మండల అధ్యక్షులు అంగోత్ రాజు నాయక్, మహేశ్వరం సర్పంచ్ నవీన్, అంబయ్య యాదవ్, కర్రోళ్ల చంద్రయ్య ముదిరాజ్, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, మంచే పాండు యాదవ్, షబ్బీర్ పాల్గొన్నారు.

# నేడు ఈ జిల్లాల్లో భారీ వర్షాలు



హైదరాబాద్ : తెలంగాణలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో ఇవాళ, రేపు కూడా వానలు దంచికొట్టనున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మెదక్, కామారెడ్డి, MBNR, నాగర్ కర్నూల్, కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. అటు ఏపీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు పడతాయని తెలిపింది.

# రైతులకు గుడ్ న్యూస్..ఎల్లుండి ఖాతాల్లోకి 'రైతు భరోసా'

హైదరాబాద్ : రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ మేరకు 'రైతు భరోసా' నిధుల విడుదలకు ప్రభుత్వం నిధుల సమీకరణ వేగవంతం చేసింది. ఎకరానికి రూ. 6,000 చొప్పున సుమారు 73 లక్షల మంది అర్హులైన రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేయనుంది. ఈ నెల 30న ఖమ్మం జిల్లాలో నిర్వహించే బహిరంగసభలో సీఎం రేవంత్ ఈ నిధులను విడుదల చేయనున్నారు. అయితే ఈ నిధులను ఒకేసారి విడుదల చేస్తుందా లేదా విడతల వారీగా జమ చేస్తుందా అనేది తెలయాల్సి ఉంది.



# గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయం : మంత్రి పొంగులేటి

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ఆకాశం నుంచి వర్షపు చినుకులు నేలను తాకుతున్నా.. వాతావరణం అనుకూలించకపోయినా లెక్కచేయకుండా, గ్రామీణ రవాణా కష్టాలను తీర్చడమే ధ్యేయంగా ప్రగతి బాట సాగింది. పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో శనివారం తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఒకవైపు చిరుజల్లులు కురుస్తున్నా... వర్షపు చినుకుల సాక్షిగానే దుబ్బతండా, లాల్ సింగ్ తండా, జీళ్ళచెరువు గ్రామాల్లో రూ. 16.13 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొని మాట్లాడుతూ వర్షాకాలంలో తండాలు, పల్లె ప్రజలు బురద రోడ్లు, ఉధృతంగా ప్రవహించే వాగుల వల్ల బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోకుండా ఉండేందుకే ఈ పనులను త్వరితగతిన మంజూరు చేయించామని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి తన పర్యటనలో భాగంగా దుబ్బతండా గ్రామంలో జడ్పీ రోడ్డు గైగోల్లపల్లి నుంచి దుబ్బతండా వరకు రూ. 2.10 కోట్ల అంచనా వ్యయంతో, అలాగే జడ్పీ రోడ్డు నుండి కొత్తూరు ఎర్రగడ్డ తండా మీదుగా దుబ్బతండా వరకు రూ. 4.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం లాల్ సింగ్ తండా నుంచి నేరేడువాయి వరకు రూ. 2.03 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, జీళ్ళచెరువు గ్రామంలో జీళ్ళచెరువు మీదుగా కొండాపురం నుంచి మోటాపురం వెళ్ళే ప్రధాన రహదారిపై రూ. 7.50 కోట్ల వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెండు వంతెనల (బ్రిడ్జిల) నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల జిల్లా, నియోజక, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉన్నత లక్ష్యాలతోనే విజయ శిఖరాలకు

* **విద్యార్థులకు కలెక్టర్ రాహుల్ శర్మ సూచన**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ, (ప్రజా స్ఫూర్తి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ఇష్టపడి చదివితేనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం రేగొండ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, పదో తరగతి విద్యార్థులతో బయాలజీ, తొమ్మిదో తరగతి విద్యార్థులతో గణితంపై ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను అభినందించారు. అనంతరం నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, ఉపాధ్యాయులుగా ఎదగాలన్న విద్యార్థుల ఆశయాలను అభినందించిన కలెక్టర్, చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చెంచుకాలని గ్రామం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా సౌకర్యం లేదా సైకిళ్లు అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేష్, ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ మోనిక తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా కుభీర్ మండలంలోని సిరిపేల్లి, గోడాపూర్, న్యూ సాంవ్లి, కుభీర్, గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ గారు పరామర్శించారు.ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ పెద్దలను కోల్పోవడం తీరని లోటని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల నాయకులు,గ్రామ పెద్దలు, పార్టీ కార్యకర్తలు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## యోగతో ఆరోగ్యం – మొక్కలతో పర్యావరణ పరిరక్షణకు విద్యార్థుల ప్రతిజ్ఞ



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : హైదర్‌నగర్ డ్రీమ్ వ్యూ కాలనీలోని ఇగ్నైట్ విద్యాసంస్థల క్రీడా ప్రాంగణంలో శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ యోగా శిక్షకులు జగన్ గురూజీ, ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత ఎంఎస్‌కే ప్రసాద్, శ్రీశ్రీ హోలిస్టిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ తుషార ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు విద్యార్థులకు యోగా యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. నిత్య జీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చని వివరించారు.అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా విద్యార్థులు, అతిథులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులను ఇగ్నైట్ విద్యాసంస్థల చైర్మన్ రమేష్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి యక్కంటి, కార్యదర్శి గువ్వల శ్రీనివాసరెడ్డి, గొట్టిముక్కల దేశాలు తదితరులు పాల్గొన్నారు. యోగా, పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేలా కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బౌరంపేట్ డివిజన్ లక్ష్మీ గణపతి ఎన్క్లావ్ లోని శ్రీశ్రీశ్రీ బంగారు మైసమ్మ తల్లి ఆలయ 7వ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ పాల్గొని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కోల్తూర్ మల్లేష్ ముదిరాజ్, తాజా మాజీ కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, విష్ణు వర్ధన్ రెడ్డి, వార్డు ప్రెసిడెంట్ శంభీపూర్ సుదర్శన్, కాలనీ ప్రెసిడెంట్ సమరసింహారెడ్డి, నాయకులు రాజశేఖర్ యాదవ్, ఆకుల అశోక్, మచ్చేందర్, జితేందర్ రెడ్డి, యాదగిరి, రాజు, మల్లేష్, బాలరాజు, శ్రీశైలం, వీరస్వామి, సదానందం, శ్రీను, ప్రభు, యాకూబ్ రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, అశోక్ రెడ్డి, రాంబాబు, శ్రీకాంత్ యాదవ్, శ్రీధర్, స్థానికులు ఆలయ కమిటీ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు..

## భూ సర్వే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలి

: **ఎమ్మెల్యే జీఎస్ఆర్**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ సర్వే, సరిహద్దుల నిర్ధారణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని పట్టాల సమస్యలను పరిష్కరించుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు (జీఎస్ఆర్) సూచించారు. శనివారం గణపురం మండలం బుద్ధారం, భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో సుమారు 50 వేల మంది పట్టాదారులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. సర్వే ద్వారా సరిహద్దులను ఖరారు చేసి అర్హులైన రైతులకు పట్టాలు అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భూమి యజమాని స్వయంగా హాజరు కాకపోయినా అవసరమైన వివరాలు నమోదు చేసి సర్వే పూర్తిచేసే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.పట్టాలు లేక రైతు భరోసా, రైతు బీమా, భూముల రిజిస్ట్రేషన్ వంటి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందలేకపోతున్న రైతులు ఈ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని సూచించారు. సింగరేణి, సోలార్ ప్రాజెక్టులు, పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతుల సమస్యల పరిష్కారానికీ ఈ సర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో, భూ సర్వే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్‌నాయకులు,రైతులు పాల్గొన్నారు.

## కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

* **బి.ఆర్.ఎస్.ఎల్.పి. విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కాలనీలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలుకు తమ వంతు కృషి చేస్తామని బి.ఆర్.ఎస్.ఎల్.పి. విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 287వ వార్డు, పేట్‌బషీరాబాద్ పరిధిలోని ధండమూడి ఎన్‌క్లేవ్ కాలనీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు శనివారం బి.ఆర్.ఎస్.ఎల్.పి.విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని ఆయన నివాస కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అభినందనలు తెలియజేస్తూ, కాలనీ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో దండమూడి ఎనక్లేవ్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షుడు కిరణ్ కుమార్, కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు సాయి రాజశేఖర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి జార్జ్ థామస్, కోశాధికారి నాగరాజు పుప్పాల, కార్యవర్గ సభ్యులు వెంకట రమణ, కృష్ణ ప్రసాద్, వాసుదేవ్, విక్రమ్ రావు, ఉదయ భాస్కర్ రావు, తిరుమల్ గౌడ్, అభిలాష్, చిన్నా రెడ్డి, సరోజా రెడ్డి, జ్యోతి, కాలనీ పెద్దలు సుధాకర్ రావు, ప్రభాకర్ రెడ్డి ఇంకా సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## కాలనీ సమగ్ర అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుంది

* **బి.ఆర్.ఎస్.ఎల్.పి. విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి: కాలనీ సమగ్ర అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని బి.ఆర్.ఎస్. ఎల్.పి. విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. శనివారం 286వ వార్డు పరిధిలోని కుత్బుల్లాపూర్ గ్రామం, విమానపురి కాలనీ నూతనంగా ఎన్నికైన వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నూతన కమిటీకి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కాలనీలో కొన్ని సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజీ పైప్‌లైన్ ప్రస్తుతం సామర్థ్యానికి సరిపోకపోవడంతో దానిని పునర్నిర్మించి విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించి, సమస్యను అత్యవసరంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకుని పరిష్కరించాలని సూచించారు. కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులు జిట్టా బల్వంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు రావి హనుమంత్ రావు, పార్థన్ పిళ్ళై, కార్యదర్శి అజీష్ నాయర్, సంయుక్త కార్యదర్శి కృష్ణ, అశ్లే, శంకర్ రావు, కోశాధికారి అరుణ్ కుమార్, రామారావు, సాయి గుప్త, మహేష్‌గౌడ్, హేమంత్ రెడ్డి , కాలనీ ప్రముఖులు, సంక్షేమ సంఘం సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## డీపీఓ కార్యాలయంపై ఎస్పీ ఆకస్మిక తనిఖీ

* **రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని అధికారులకు ఆదేశం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లోని పరిపాలన విభాగాన్ని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న పరిపాలనా రికార్డులు, సర్వీస్ రిజిస్టర్లు, ఫైళ్ల నిర్వహణ, అధికారిక పత్రాలు, పెండింగ్ వ్యవహారాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి సక్రమంగా నిర్వహించాలని, పెండింగ్ ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా కార్యాలయ నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. పరిపాలనా వ్యవస్థలో పారదర్శకత, క్రమశిక్షణకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

## ఈనెల 28న జిల్లావ్యాప్తంగా నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

* **జిల్లా కలెక్టర్ హరిత**



కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా,ప్రజా స్ఫూర్తి: జిల్లాలోని పిల్లల భవిష్యత్తును పోలియో మహమ్మారి బారి నుండి రక్షించేందుకు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జూన్ 28 (ఆదివారం) నాడు జిల్లావ్యాప్తంగా 'పల్స్ పోలియో' చుక్కల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె హరిత అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన గోడ ప్రతులను పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని నేనే స్వయంగా జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ అధికారి డా. కె. సీతారాం వైద్య సిబ్బందితో కలిసి ప్రారంభిస్తున్నామని అన్నారు. 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న ప్రతి చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. రేపు జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో మళ్లీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించుకోవాలన్నారు. పోలియో రహిత సమాజ స్థాపన కోసం తల్లిదండ్రులందరూ బాధ్యతగా తమ 5 సంవత్సరాల లోపు పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌కు తీసుకువచ్చి, తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సోమ, మంగళవారాలలో సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు పంపిణీ చేస్తారని అన్నారు.

## రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించిన నిర్మల్ జిల్లా షీ టీమ్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ



ప్రజా స్ఫూర్తి, భైంసా : రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ పనితీరు కనబరిచి మొదటి స్థానం సాధించిన నిర్మల్ జిల్లా షీ టీమ్ సభ్యులను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల శనివారం జిల్లా భరోసా కేంద్రాన్ని సందర్శించి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికల భద్రతకు షీ టీమ్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించడం, ఫిర్యాదులపై తక్షణ స్పందనతో సమర్థవంతంగా విధులు నిర్వహించడం వల్లే రాష్ట్ర స్థాయిలో ఈ ఘనత సాధించారని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా మరింత సమర్థవంతంగా పనిచేసి జిల్లా పోలీసులకు మరిన్ని విజయాలు తీసుకురావాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సాధించడం జిల్లా పోలీసు శాఖకు గర్వకారణమని పేర్కొంటూ, షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్ఐ ఎం. నర్సయ్యతో పాటు షీ టీమ్ సభ్యుల సేవలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఓటరు జాబితా పరిశుద్ధతకు ప్రజల సహకారం అవసరం

* **ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ, (ప్రజా స్ఫూర్తి): ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనకు ప్రజల సహకారం అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం రేగొండ మండలంలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆయన పరిశీలించారు. బీఎల్ఓలు ఇంటింటికి పంపిణీ చేస్తున్న ఎన్యూమరేషన్ ఫారాలు, నమోదులు, యాప్ ఎంట్రీలను తనిఖీ చేసిన ఆయన.. ప్రతి ఇంటికి ఫారాలు అందించి, ఓటర్ల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. ఓటర్లు తమ పేర్లు జాబితాలో పరిశీలించుకోవడంతో పాటు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలను తెలియజేసి పరిశుద్ధమైన ఓటరు జాబితా తయారీలో భాగస్వాములు కావాలని కోరారు. 18 ఏళ్లు నిండిన యువత తప్పనిసరిగా ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రం 223 పరిధిలోని 1,171 మంది ఓటర్లందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందించి, స్వీకరణ రసీదు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# 95 లక్షల నిధుల ప్రొసీడింగ్ కాపీలను అందజేసిన ఎమ్మెల్యే



ప్రజా స్ఫూర్తి, భైంసా: ఎమ్మెల్యే కు ధన్యవాదాలు తెలిపిన గన్నోరా కోతుల్ గావ్ గ్రామ సర్పంచ్ లు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీలను ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ గన్నోరా, కోతుల్ గాం గ్రామ సర్పంచ్ లకు అందజేశారు. గన్నోరా గ్రామానికి రైతుల ధాన్యం నిలువ కోసం 30 లక్షల రూపాయలతో గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. అదే విధంగా కోతుల్ గాం గ్రామం లో సిసి రోడ్ల నిర్మాణానికి 20 లక్షల రూపాయల నిధులు, వంతెన నిర్మాణానికి 45 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు, సంబంధిత గ్రామాల నాయకులు ఎమ్మెల్యేను సన్మానించి, కృతజ్ఞతలు చెప్పారు. గ్రామాల అభివృద్దే తన ధ్యేయం అని దశలవారీగా నిధులు మంజూరు చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచులు అప్పలరాజు, భూమేష్, మాజీ ఎంపిటిసి లక్ష్మీనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయండి: డీఎంహెచ్‌వో



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నేటి నుంచి నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం జిల్లా వైద్యాధికారులు, సిబ్బందితో జూమ్ సమీక్ష సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. జిల్లాలో 0-5 సంవత్సరాల వయస్సు గల ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 98 818 మంది 0-5 సంవత్సరంలోపు పిల్లలకు పోలియో చుక్కలు ఇవ్వడం జరుగుతుందని, మొత్తం 925 బూత్‌లు, 38 ట్రాన్సిట్ పాయింట్లు , 1001టీములు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేయడం, అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రతి వైద్యాధికారి, ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పల్స్ పోలియో బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ రాకేష్, డాక్టర్ ప్రతాప్, డిప్యూటీ డీఎంహెచ్‌వో నాగలక్ష్మి , సిహెచ్ఓ నాగభూషణం, హెచ్ఇవో రాంప్రసాద్, రామారావు, హరికృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

# షాపులకు ఇబ్బంది లేకుండా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరంలో విజయవాడ హైవేపై 16వ డివిజన్ పరిధిలో చేపడుతున్న డ్రెయినేజీ నిర్మాణం వల్ల షాప్ యజమానులకు నష్టం కలగకుండా చూడాలని 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ నగర కమిషనర్ కొడరు సుజాతకి విన్నవించారు. జాతీయ రహదారిపై చినుకు పడితే ఆ ప్రాంతం చెరువులా మారి పాదచారులకు, వాహనాలపై వెళ్లే వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, ప్రతిరోజు శానిటేషన్ సిబ్బంది ఆ నీటిని క్లియర్ చేసేందుకు గంటల కొద్ది సమయం వెచ్చించాల్సి వస్తుందన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని నగర కమీషనర్‌ను ఆదేశించగా, శనివారం కమీషనర్ ఆ ప్రాంతాన్ని సందర్శించి రోడ్డు మధ్య నుండి 50 మీటర్లలో కాలువ నిర్మాణం చేపట్టాలని మార్కింగ్ ఇచ్చారు. దీనిపై కార్పొరేటర్ మునిగడప పద్మ కమిషనర్‌కి 47 మీటర్లలో కాలువ నిర్మాణం చేపట్టి, షాపు యజమానులకు ఇబ్బంది కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కమిషనర్ వెంట ఏఈ బి.శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గుంటి శ్రవణ్, మాజీ కౌన్సిలర్ మునిగడప వెంకటేశ్వర్లు, జవాన్లు ప్రభుదాసు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐఐటీలో సీటు సాధించిన విద్యార్థికి ఘన సన్మానం

* **సర్పంచ్ శ్రీలత సుందర్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామానికి చెందిన బర్రె యాదగిరి కుమారుడు బర్రె హేమంత్ ఇంటర్మీడియట్ లో 1000 మార్కులకు గాను 990మార్కులు సాధించారు. అదేవిధంగా ఐఐటీలో సీ ఎస్ సీ సీటు సాధించారు. విషయం తెలుసుకున్న పంతంగి సర్పంచ్ శ్రీలత సుందర్ విద్యార్థి హేమంత్ ను సంస్థలతో కలిసి శనివారం ఘనంగా సన్మానించారు. ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# 42 చోరీ కేసుల నిందితుడు అరెస్ట్.. వరుస దొంగతనాల గుట్టురట్టు

* **మోటార్‌సైకిల్ స్వాధీనం.. మరో ఇద్దరి కోసం గాలింపు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి పోలీసులు వరుస చోరీల కేసులను ఛేదించి 42కు పైగా చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న హ్యాబిచ్యువల్ నేరస్థుడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి చోరీకి గురైన బజాజ్ పల్సర్150 మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండగా, వారి కోసం గాలింపు కొనసాగుతోంది.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ఏడాది మార్చి 29న మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామంలో మూడు ఇళ్లలో తాళాలు పగులగొట్టి నగదు, బంగారు, వెండి ఆభరణాలతో పాటు ఓ మోటార్‌సైకిల్‌ను దొంగిలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం పాత ఎస్సీపేట బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో చోరీకి గురైన పల్సర్ బైక్‌పై వెళ్తున్న దాసరి మురళీకృష్ణ (30), మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునగలవీడు గ్రామానికి చెందిన వ్యక్తిని అనుమానంతో ఆపగా, అతడు తప్పించుకునేందుకు యత్నించాడు. వెంటనే పోలీసులు వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో మురళీకృష్ణ తన తండ్రి దాసరి నర్సయ్య, తమ్ముడు దాసరి గణేష్‌తో కలిసి పర్లపల్లిలో మూడు చోట్ల చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. చోరీ చేసిన నగదు, బంగారు, వెండి ఆభరణాలను విక్రయించి వచ్చిన డబ్బును వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసినట్లు తెలిపాడు. నిందితుడిపై రాష్ట్రంలోని పలు పోలీస్ స్టేషన్లలో 42కు పైగా ఇంటి చోరీ కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసును చిట్యాల సీఐ డి. మల్లేష్ పర్యవేక్షణలో మొగుళ్లపల్లి ఎస్ఐ ఎం. సురేష్, పోలీసు సిబ్బంది ఛేదించారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరు నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

పోలీసుల సూచన: రాత్రి వేళల్లో ఇళ్లకు పటిష్టమైన తాళాలు వేయాలని, విలువైన వస్తువులను భద్రంగా ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని జిల్లా పోలీసులు ప్రజలకు సూచించారు.

# ఆకుల పెంటయ్య స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తాం

: **మోకు కనకా రెడ్డి**



జనగామ, ప్రజాస్ఫూర్తి : స్వాతంత్ర్య సమరయోధుడు, కార్మిక ఉద్యమ నేత అమరజీవి కామ్రేడ్ ఆకుల పెంటయ్య స్ఫూర్తితో జనగామ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి తెలిపారు. పెంటయ్య 14వ వర్ధంతి సందర్భంగా పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన సభ లో ఆయన విగ్రహానికి కనకా రెడ్డి, అతడి కుమారులతో పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా కనకా రెడ్డి మాట్లాడుతూ ఆకుల పెంటయ్య జీవితాంతం హమాలి కార్మికులు, ఇతర శ్రామిక వర్గాల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేసిన నాయకుడని కొనియాడారు. పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ గా, కార్మిక ఉద్యమ నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారం, సాగు తాగునీటి సౌకర్యాలు, పారిశ్రామిక అభివృద్ధి కోసం ప్రజలను సమీకరించి అనేక ఉద్యమాలు నిర్వహించారని గుర్తు చేశారు. కుటుంబం కంటే కార్మికుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడిగా తను నిలిచిపోయారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని, నాలుగు లేబర్ కోడ్స్ అమలు, ధరల పెరుగుదలతో శ్రామిక వర్గంపై తీవ్ర భారం మోపుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, ఎండి అజారుద్దీన్, రమావత్ మిటియా నాయక్, పట్టణ కమిటీ సభ్యులు బాల్నే వెంకట మల్లయ్య, బూడిది ప్రశాంత్, అమాలి యూనియన్ అధ్యక్షుడు గూడెల్లి రాజు, పాము కృష్ణమూర్తి, ఎండి గౌసియా, కొలిపాక వెంకటలక్ష్మి, మాదాసి సుధాకర్, మల్లయ్య, ఆర్టియా, భాస్కర్, రాజు , తదితరు లు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ సెక్రటరీ సురేంద్రమోహన్ ను కలిసిన మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రజాపాలన - పట్టణ ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్ సురేంద్రమోహన్ ను సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.డి. ఫసియొద్దీన్ (ముక్రం) పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి, రైతులకు మెరుగైన సేవల అందుబాటు, మౌలిక సదుపాయాల విస్తరణ, మార్కెట్ సేవల నాణ్యత పెంపు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రైతుల సంక్షేమం మరియు మార్కెట్ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రతిపాదనలను ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకువెళ్లారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, సమర్పించిన ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని సురేంద్రమోహన్ తెలిపారు.

# గుడిసెలు లేని తెలంగాణే లక్ష్యం

* **నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**
* **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: నిరుపేదలకు నీడ కల్పించాలన్నా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం అయ్యేలా క్షేత్రస్థాయిలో పని చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని ఆయా మండలాల వారీగా సమీక్షిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాకు మంజూరైన (8953) ఇళ్లకు గాను 81 శాతంతో (7271) ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తి అయిందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ పర్యటించి, నిర్మాణాలు వేగవంతం అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికీ ప్రారంభించని ఇండ్లను వెంటనే ప్రారంభించి జూలై 15 వరకు పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజూ ఎన్ని ఇళ్లు పూర్తి అవుతున్నాయన్న అంశం మీద సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. దారిద్య రేఖకు దిగువన ఉండి ఇండ్లు నిర్మించుకోలేని నిరుపేదలు మహిళా స్వయం సహాయక సభ్యులుగా ఉన్నట్లయితే డి ఆర్ డి ఓ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేసి ఇండ్లు నిర్మించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డి ఆర్ డి ఓ ను ఆదేశించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఇప్పుడు గుడిసెలో నివసించే వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ముందుకు పోతున్నామన్నారు. జిల్లాలోని అన్ని నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ మాణిక్యం, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఏ పి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మున్సిపల్ కమిషనర్స్ డిఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వతంత్ర పోరాట స్ఫూర్తిప్రదాత బంకించంద్ర చటర్జీ

* **జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు**




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : భారత స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి ప్రదాత బంకిం చంద్రచటర్జీ అని జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్ రామరాజు అన్నారు. బంకించంద్ర చటర్జీ 188వ. జయంతి వేడుకలు స్థానిక శ్రీరాం నగర్ బిసి కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాచర్ల రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శంతన్ రామరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి వందేమాతరం దేశభక్తి గేయాన్ని అందించిన గొప్ప కవి బంకించంద్రచటర్జీ అని పేర్కొన్నారు. కవిగానే కాకుండా వ్యాసరచయితగా, సంపాదకుడిగా స్వాతంత్ర్య సమరయోధుడిగా తనదైన ముద్రవేసిన బంకిం చంద్రచటర్జీ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. బంకిం చంద్రచటర్జీ సూర్యచంద్రులున్నంత వరకూ భారతీయుల హృదయాల్లో విరాజిల్లుతూనే ఉంటాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది రాజేశ్వరి, అర్చనతో పాటు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పనులకు ప్రభుత్వ భూమిలో మట్టి తరలిస్తే తప్పేంటి?

* **మున్సిపాలిటీ కాంగ్రేస్ పార్టీ కౌన్సిలర్, మాజీ కౌన్సిలర్లు**



అందోలు,ప్రజాస్ఫూర్తి : బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో అందోలు పెద్ద చెరువు కట్టకు వెయ్యి టిప్పర్ల మట్టిని ఏ అనుమతి తీసుకొని 1141 సర్వే నంబరు నుంచి తరలించారో బయటపెట్టాలని అందోలు-జోగిపేట మున్సిపల్ కౌన్సిలర్ తోట రామకృష్ణ, మాజీ కౌన్సిలర్‌లు ఆర్. ప్రదీప్‌గౌడ్, టి.హరికృష్ణాగౌడ్, అందోలు మాజీ సర్పంచ్ కే.శ్రీనివాస్ యాదవ్‌లు డిమాండ్ చేసారు. శనివారం అందోలులో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడారు. రూ.80 కోట్లతో చేపడుతున్న జోగిపేట-అజ్జమర్రి రోడ్డు నిర్మాణం పనులను బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న రోడ్డు నిర్మాణ పనులకు ప్రభుత్వ భూమి అయిన 1141 సర్వే నెంబర్ లో గల మట్టిని తరలిస్తే తప్పేంటని వారు ప్రశ్నించారు. మంత్రి చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూమిలో నుంచి విచ్చలవిడిగా మట్టిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నారని వారు ఆరోపించారు. అందోలు శివారు నుంచి అందోలు అంబేద్కర్ విగ్రహం వరకు డివైడర్ ఏర్పాటు చేసి అవసరమైన మట్టిని ప్రభుత్వ భూమి నుంచే వాడుకున్నారని అన్నారు. ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అయినా మే 22 రోజున అప్లికేషన్ పెట్టుకోవడం జరిగిందని అధికారుల అనుమతితోనే ప్రభుత్వ పనులకు వినియోగిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మొరం అక్రమ రవాణా చేసారని అధికార పార్టీపై చేసపిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గతంలో వాహనాలను అడ్డుకున్న వారే అడ్డగోలుగా 1141 సర్వే నంబరులోని భూమిలో నుంచి మట్టిని తరలించుకుపోయారని వారు ఆరోపించారు.

# మరణించిన కార్మికుడికి తోటి కార్మికులు ఆర్థిక సహాయం



కూసుమంచి, ప్రజా స్ఫూర్తి:కూసుమంచి మండలంలోని కార్మికుడు అరవపల్లి పరశురాం కుటుంబానికి తోటి కార్మికులు అండగా నిలిచారు. ఇటీవల కరెంట్ షాక్ తో మరణించిన పరశురామ్ కుటుంబానికి కార్మికుల శ్రమ నుండి క్వింట యాభై కేజీలు బియ్యం శనివారం ఐ ఎఫ్ టి యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కూసుమంచి లో హమాలి పని చేస్తూ జీవనం సాగిస్తున్న పరశురామ్ అకస్మాత్తుగా కరెంట్ షాక్ తో మరణించడంతో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. తోటి కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో కార్మికులందరూ స్వచ్ఛందంగా వారి వారి శ్రమలో కొంత ఆర్థిక సహాయంగా బియ్యం అందించారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి ఈ సాయం కొంత ఊరటనిస్తుందని ప్రతినిధులు పేర్కొన్నారు. కార్మికుల మధ్య ఉన్న ఐక్యత, మానవత్వాన్ని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.ఈ కార్యక్రమానికి ఐ ఎఫ్ టి యు ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ వెంకన్న, ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు గోపె రవి, కాంపాటి మధు, హమాలీ కార్మికులు గోపాల్ ,లింగ ,ఉపేందర్ ,వెంకటేశ్వరరావు ,రమేష్ ,నరేష్, శ్రీను, అనిల్ ,నాగేశ్వరరావు, పవన్, నాగన్న, వెంకన్న ,తదితరులుపాల్గొన్నారు.

# నేడే పల్స్ పోలియో ప్రారంభించనున్న జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా: జిల్లాలో పల్స్ పోలియో ప్రోగ్రాం ఆదివారం ఉదయం 8 గంటలకు పురపాలక కార్యాలయంలో కలెక్టర్ ప్రతిమాసింగ్ ప్రారంభోత్సవం చేస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి ఏర్పాట్లు పూర్తి చేశామని , సిబ్బందికి శిక్షణ కూడా పూర్తి చేశామని, ఈ కార్యక్రమం కోసం పిల్లల నిపుణులైన వైద్యుల సేవలను కూడా తీసుకుంటున్నామని , ప్రజలు తమ 5 సంవత్సరాల వయసు లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో వేయించని వారు 29,30 తేదీలలో తమ ఇంటి వద్దకు వచ్చే ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలియో చుక్కలు వేయించాలని, ప్రయాణాలలో వున్నవారు బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కేంద్రం వద్ద పోలియో చుక్కలు వేయించాలని, ఇటుక బట్టీలు, వ్యవసాయపనులు, ఇతర పని ప్రదేశాలలో వున్న పిల్లలకోసం కూడా ప్రత్యేక ఎర్పాట్లు చేశామని, ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కోరారు.

# ఓటరు జాబితా సవరణకు కాంగ్రెస్ శ్రేణు లు కృషి చేయాలి

* ఇంటింటా ఎన్యుమరేషన్ పారాలపంపిణీలో కౌన్సిలర్ పూజిత జహంగీర్



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా "మన ఓటు - మన బాధ్యత" నినాదంతో భువనగిరి పట్టణంలోని 86వ పోలింగ్ బూత్ పరిధిలో ఇంటింటా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బర్రె పూజితజహంగీర్ పాల్గొని బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ) అనిల్ నాయక్‌తో కలిసి ఓటర్లకు ఫారాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి అర్హుడికి రాజ్యాంగ బద్ధంగా ఓటు హక్కు కల్పించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు కావడంతో పాటు ఎలాంటి తప్పిదాలు లేకుండా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.రానున్న నెల రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కష్టపడి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బండారు రవి వర్ధన్, భూషపాక ఈశ్వర్ బాబు, బర్రె క్రాంతి, కొండమడుగు రాము, బొల్లారం భారతి, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గుగులోత్ సురేష్ నియామకం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకత్వం మహబూబాబాద్ జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా గుగులోత్ సురేష్‌ను అధికారికంగా నియమించింది. పార్టీ బలోపేతం,గిరిజన హక్కుల పరిరక్షణ, గ్రామ స్థాయిలో బీజేపీ సిద్ధాంతాల విస్తరణలో ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. గుగులోత్ సురేష్ గత కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ గిరిజన యువత, రైతులు, సామాన్య ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారు.మహబూబాబాద్ జిల్లాలో బీజేపీ సంస్థాగత బలోపేతానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పలువురు నాయకులు అభినందించారు.ఈ సందర్భంగా గుగులోత్ సురేష్ మాట్లాడుతూ "నాపై నమ్మకం ఉంచి జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మరియు జిల్లా నాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు.గిరిజన సమాజ అభివృద్ధి, యువత సాధికారత, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో మరింత కృషి చేస్తాను" అని తెలిపారు.పార్టీ కార్యకర్తలు, అభిమానులు,స్థానిక నాయకులు గుగులోత్ సురేష్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ,ఆయన నాయకత్వంలో మహబూబాబాద్ జిల్లాలో బీజేపీ మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అగ్ని ప్రమాదాల పట్ల సమయస్ఫూర్తిగా వ్యవహరించాలి

* అగ్నిమాపక మండల అధికారి శివాజీ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సమయస్ఫూర్తిగా వ్యవహరించి ప్రమాదాల బారి నుంచి బయటపడాలని అగ్నిమాపక శాఖ మండల అధికారి శివాజీ సూచించారు. చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి వెంట ఉన్న దుకాణదారులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అకస్మాత్తుగా గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వెలువడితే, ఎలా అరు ఫాలో కళ్లకు కట్టినట్టు చేసి చూపించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ హోటల్, రెస్టారెంట్లలో వంట గ్యాస్ పట్ల అప్రమంతంగా ఉండాలన్నారు. సిలిండర్ నుంచి ఎలాంటి లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిలిండర్ కు మంటలు అంటుకుంటే, భయాందోళనకు గురికాకుండా నీటిలో ముంచిన కాటన్ వస్త్రంతో, ఖాళీ బకెట్ తో మంటలు ఆల్పవచ్చన్నారు. లీడింగ్ ఫైర్ ఫైటర్ ఏఎస్ ఐ నగేష్, అగ్నిమాపక సిబ్బంది రమేష్, నరేష్, శేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి

* ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : వలిగొండ మండలంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం విస్తృతంగా పర్యటించి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతితో పాటు వర్షాకాలం నేపథ్యంలో డ్రైనేజీ సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల మొదటి దశ ఫేజ్ 1 లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఫేజ్ 1లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన తర్వాతే అర్హులైన కొత్త లబ్ధిదారులను గుర్తించి ఫేజ్ 2 మంజూరు జాబితాకు ప్రతిపాదనలు పంపే అవకాశం ఉంటుందని తెలిపారు. నిర్మాణాలు పెండింగ్‌లో ఉంటే తదుపరి ప్రక్రియలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశముందని వివరించారు. గ్రామ పంచాయతీ సర్పంచులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తూ తమ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించి, లబ్ధిదారులు సకాలంలో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా సంబంధిత అధికారులకు నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పెండింగ్‌లో ఉన్న పనులను అత్యంత ప్రాధాన్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

# అసంపూర్తిగా మిషన్ భగీరథ గుంటలు

* ఇరుకు గల్లీల్లో ఇక్కట్లు పడుతున్న వాహనదారులు
* అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు





ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పనులు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంతోపాటు చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ పట్టణాల్లో అసంపూర్తి పనుల కారణంగా అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పైపులైన్ల ఏర్పాటు కోసం తవ్విన గుంటలను రోజుల తరబడి పూడ్చకుండా వదిలేయడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చిన్నచిన్న ఇరుకు సందుల్లోనూ పనులను త్వరితగతిన పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేయడం పట్ల స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అనేక ప్రాంతాల్లో పైపులైన్లు ఏర్పాటు చేసినప్పటికీ ఇంకా ట్రయల్‌రన్ పూర్తి కాకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో లీకేజీలు ఉన్నా వాటికి మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో గుంతలు అలాగే ఉండిపోతున్నాయి. ఇంకొన్నిచోట్ల లీకేజీ నీరు రోడ్లపై పారుతుండటంతో ఆ ప్రాంతం చిత్తడిగా మారిపోతుంది. మూలమలుపుల వద్ద పెద్ద పెద్ద గోతులు తీసి తిరిగి పూడ్చడంలో అలసత్వం వహిస్తున్న కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. మరోవైపు గుంతలను పూడ్చాలని ఎన్నిసార్లు స్థానికులు మిషన్ భగీరథ పనులు చేస్తున్న సిబ్బందికి విజ్ఞప్తి చేసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వారి నోటికొచ్చిన సమాధానం చెప్తూ కాలం వెళ్లదీస్తున్నారని, ప్రజల సహనాన్ని పరీక్షిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికే రోడ్లన్నీ తవ్విన కారణంగా వాహనాలు రాకపోకలు సాగించడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం వర్షాలు కూడా పడుతుండటంతో వర్షపునీరు మిషన్ భగీరథ గుంతల్లో నిలిచిపోయి కన్పించడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. గల్లీల్లో పిల్లలు ఆడుకుంటూ గుంతల్లో పడిపోయి గాయాలపాలవుతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం మిషన్ భగీరథ పనులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ పనులు వేగవంతం చేయాలని, గుంతలను త్వరగా పూడ్చాలని ఆదేశించినప్పటికీ సిబ్బందిలో మాత్రం మార్పు కన్పించడంలేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా గుంతలను పూడ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# వరదలను సమర్థంగా ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు చేపట్టాలి

* పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలి
* గోదావరి వరదల సన్నద్ధతపై జిల్లా అధికారులతో మంత్రి తుమ్మల




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: వర్షాకాలంలో గోదావరి నదిలో వరదల నేపథ్యంలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరదల సన్నద్ధతపై జిల్లా యంత్రాంగం చేపట్టిన చర్యలను జిల్లా కలెక్టర్ అంకిత్ మంత్రికి వివరించారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఈ ఏడాది నుంచి మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయాల్లో ఎమర్జెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో వరదల సమయంలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను గుర్తించి, వైద్యం, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, ఇరిగేషన్, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ తదితర శాఖల ద్వారా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు పోలీసు శాఖ పూర్తిస్థాయిలో సన్నద్ధంగా ఉందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎలినోవో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ సమావేశంలో ఐటిడిఏ పిఓ రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం ఆర్డీవో మధు, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, అటవీ, అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారులు

- ప్రభుత్వ పాఠశాలల్లో సర్వే
: ఎస్ఎఫ్ఐ



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించకుండా.. ప్రైవేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్నారని చౌటుప్పల్ మండల కార్యదర్శి తీగుళ్ళ శ్రీనివాస్ తీవ్రంగా ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ పిలుపు మేరకు చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు, పంతంగి, కుంట్లగూడెం, తంగడపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా పరిస్థితులపై శనివారం సర్వే నిర్వహించారు. తరగతి గదులను, మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తీగుళ్ళ శ్రీనివాస్



మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై చాలా రోజులు గడిచినా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాధికారి స్వయంగా పరిశీలించకపోవడం అత్యంత దురదృష్టకరమని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు, తగిన తరగతి గదులు లేకపోవడం, విద్యార్థులకు ఇప్పటికీ పూర్తి స్థాయిలో యూనిఫాంలు అందకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. అధికారులు పర్యవేక్షణ కొరవడడంతో విద్యా వ్యవస్థపై ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే పేరుతో కొన్ని ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం ఆలోచించడం సరైన నిర్ణయం కాదని, వాటిని మూసివేయకుండా అవసరమైన వసతులు కల్పించి బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్న అధికారుల వైఖరిని తీవ్రంగా ఖండిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను నిర్లక్ష్యం చేసి ప్రైవేట్ పాఠశాలలకు కొమ్ముకాస్తున్న జిల్లా అధికారులపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాలశం సృజన, ఇరిగి వరుణ్ తేజ్, చెక్క జయంత్, జస్వంత్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌టీ హాస్టళ్లలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన..

* డీ-అడిక్షన్ కేంద్రంలో రోగులకు కౌన్సెలింగ్.




జనగామ, ప్రజాస్ఫూర్తి : డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్.టీ హాస్టళ్లలో శనివారం మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, వాటి నివారణ చర్యలు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో సానుకూల ఆలోచనలు, ఆరోగ్యకరమైన వినోద కార్యకలాపాలను ప్రోత్సహించే ఉద్దేశంతో క్యారమ్ బోర్డులు, చెస్ బోర్డులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యులతో కలిసి డీఅడిక్షన్ కేంద్రాన్ని సందర్శించిన డీసీపీ, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మాదకద్రవ్యాల వ్యసనం వల్ల కలిగే దుష్పరిణామాలపై వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, చికిత్సను కొనసాగిస్తూ పునరావాసం దిశగా ముందుకు సాగాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం పై విద్యార్థులు, యువత లో అవగాహన పెంపొందించి, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

# మల్కాజిగిరి నేరేడుమెట్టులో ఘనంగా తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా పండుగ



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : మల్కాజిగిరి నియోజకవర్గంలోని నేరేడుమెట్టులో పిట్ల విజయలక్ష్మి ఆధ్వర్యంలో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) జెండా పండుగ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొట్టాల యాదగిరి, కూల శ్రీనివాస్, మేక లలిత, శ్రావణి పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవ పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జెండా పండుగను విజయవంతం చేశారు.

# ఓటరు వివరాల ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి

* ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం వలిగొండలోని తన నివాసంలో ఓటరు వివరాల ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు, బూత్ లెవల్ సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి ఆయనతో పాటు కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను నమోదు చేశారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే పూర్తిగా సహకరించి అవసరమైన వివరాలను అధికారులకు అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు చేయించుకోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో భాగంగా జరుగుతున్న ఎన్యూమరేషన్ ప్రక్రియకు ప్రజలందరూ సహకరించి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దశరథ నాయక్ ఎంపీడీవో జలంధర్ రెడ్డి బిఎల్ఓ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాలు అమ్ముతున్న సెయింట్ ఆల్ఫోన్స్ పాఠశాల యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలి

* ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళి కృష్ణ



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా పుస్తకాలు అమ్ముతున్న సెయింట్ అల్ఫాన్స్ ప్రైవేట్ పాఠశాల పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ అధికారులను డిమాండ్ చేశారు.దుప్పలపల్లి రోడ్డులో ప్రైవేటు బిల్డింగులో అమ్ముతున్న పుస్తకాలను పట్టుకొని ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ మాట్లాడుతూ సెయింట్ ఆల్బన్స్ పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ అనుమతి లేకుండా పుస్తకాలు అమ్మడం చట్ట విరుద్ధమని అన్నారు. పుస్తకాలపై ఉన్న ధరలకంటే దాదాపు 50% అధిక ధరలకు యాజమాన్యం అమ్ముతూ విద్యార్థులను దోచుకు తింటున్నారని ఆరోపించారు. పాఠశాల యాజమాన్యం పై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో అనేక పాఠశాలలు బహిరంగంగా పుస్తకాలు విక్రయం చేస్తుంటే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని, ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారులు ఇలాగే చేస్తే పాఠశాలలపై ప్రత్యక్ష దాడులు చేస్తామని, జిల్లా విద్యాశాఖ ఆఫీసు ముట్టడి చేస్తామని హెచ్చరించారు.ఈ ధర్నాలో సంగం జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా యశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్, అరవింద్ తదితరులు ఉన్నారు.

# చిన్ననాటి మిత్రుడి కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సాయం

*** ఎమ్మెల్యే కుంభం**

వలిగొండ , ప్రజాస్ఫూర్తి: భువనగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి శనివారం తన స్వగ్రామమైన వలిగొండలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీలు, వీధుల్లో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్ తదితర సమస్యలపై స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.పర్యటనలో భాగంగా పలువురు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందించారు. ఈ క్రమంలో తన చిన్ననాటి ప్రాణమిత్రుడు రామచంద్రు ముదిరాజ్ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకుని వెంటనే స్పందించారు. ఆ కుటుంబానికి వ్యక్తిగతంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని వారికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సొంత ఊరి ప్రజలతో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. ఎమ్మెల్యే అందించిన సహాయానికి రామచంద్రు ముదిరాజ్ కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, అవసరమైన సమయంలో వెంటనే చేయూతనివ్వడం ఎమ్మెల్యే ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్షులు ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, నాయకులు,కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు,పట్టణ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.



# పీజీటీ జువాలజీ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**: వై.శ్రీహరి**

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని చౌడారం పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో గంటల ప్రాతిపదికన పీజీటీ జువాలజీ ఉపాధ్యాయ పోస్టు భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వై.శ్రీహరి తెలిపారు. 9 వ త రగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బోధించేందుకు ఈ నియా మకం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జువాలజీ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, బయోసైన్స్ లో బీఈడ్ అర్హత కలి గిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చ ని తెలిపారు. అనుభవం ఉన్న అభ్యర్థు లకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొ న్నారు. జూన్ 30 మంగళవారం ఉదయం 10.30 గంటలకు పాఠశాల ఆవరణలో డెమో తరగతి, ఇంటర్వ్యూ లు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్య ర్థులు నిర్ణీత సమయంలో హాజరుకావాలని సూచించారు.

# పోలియో చుక్కల కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

*** ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్**




ప్రజాస్ఫూర్తి, భైంసా : ఈ నెల 28 న చేపట్టే పోలియో చుక్కల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పిలుపునిచ్చారు. శనివారం భైంసా లోని తన నివాసంలో ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించిన సందర్భంగా అయన మాట్లాడారు.5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారికి చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో వ్యాధి రాకుండా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమంలో.బాధ్యతగా తల్లితండ్రులు చిన్నారులకు డ్రాప్స్ వేయించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సర్పంచుల కార్యదర్శి, చింతల బోరి సర్పంచ్ పండిత్ రావ్ పటేల్, వైద్యులు పాల్గొన్నారు.

# ఓల్డ్ నేరేడ్మెట్‌లో ఓటరు వివరాల పరిశీలన



మల్కాజ్గిరి, ప్రజాస్ఫూర్తి : ఓల్డ్ నేరేడ్మెట్ డివిజన్ పరిధిలోని బూత్ నంబర్లు 141, 142, 143, 144లలో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించారు.అర్హులైన ప్రతి ఓటరికి అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితాలో వారి పేర్లు కొనసాగేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించారు. ఒక్క నిజమైన ఓటు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు గంగాధరి కృష్ణ, పగిడిపల్లి శ్రీనివాస్, ఎలిమిలి జ్ఞానేశ్వర్‌తో పాటు బీఎల్ఎ సాయికుమార్, సునీత, ఏవీ లక్ష్మీపతి, కిషోర్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాలల బాలికల హాస్ట ళ్లలో నాన్ టీచింగ్ పోస్టులు

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని నా లుగు ఆదర్శ పాఠశాలల బాలికల హాస్ట ళ్లలో ఖాళీగా ఉన్న ఎనిమిది నాన్ టీ చింగ్ పోస్టులను అవుట్‌సోర్సింగ్ (గం టల వారీ) విధానంలో భర్తీ చేయనున్న ట్లు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికా రి సందీప్ కుమార్ ఝా తెలిపారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి జూలై 4 వరకు దరఖాస్తులు స్వీకరిస్తా మని శుక్రవారం విడుదల చేసిన ప్రకట నలో పేర్కొన్నారు. కొడకండ్లలో ఏఎన్ ఎం, జఫర్‌గఢ్‌లో ఏఎన్ఎం, అసిస్టెంట్ కుక్, వాచ్ ఉమెన్, స్టేషన్ ఘన్‌పూర్‌లో కేర్‌టేకర్ కమ్ వార్డెన్, ఏఎన్ఎం, బచ్చ న్నపేటలో హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులను భర్తీ చేయనున్నారు. కేర్‌టే కర్ కమ్ వార్డెన్ పోస్టుకు డిగ్రీతో పాటు డి.ఎడ్./బి.ఎడ్., ఏఎన్ఎం పోస్టులకు ఇంటర్మీడియట్‌తో పాటు ఏఎన్ఎం శిక్ష ణ, హెడ్ కుక్‌కు పదో తరగతి ఉత్తీర్ణత, అసిస్టెంట్ కుక్ కు ఏడో తరగతి, వాచ్ ఉమెన్‌కు పదో తరగతి ఉత్తీర్ణత అర్హత గా నిర్ణయించారు. ఆయా పోస్టులకు నిర్ణీత గౌరవ వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. స్థానికత ఆధారంగా ఎంపిక చేపట్టనున్నట్లు, హాస్టల్‌కు సమీపంలో నివసించే మహిళా అభ్యర్థులకు ప్రాధా న్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ విద్యార్హత ధ్రువపత్రాలు, రెండు సెట్ల జిరాక్స్ ప్రతు లు, ఇతర సంబంధిత ధ్రువపత్రాల తో కూడిన దరఖాస్తులను జూలై 4 సా యంత్రం 5 గంటలలోపు జిల్లా విద్యా శాఖాధికారి కార్యాలయంలో సమర్పిం చాలని సూచించారు.

# విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన ఉండాలి

*** స్పెషల్ మొబైల్ కోర్ట్ మెజిస్ట్రేట్ బక్కెర నాగలక్ష్మి**




కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: విద్యార్థి దశనుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ మొబైల్ కోర్ట్ మెజిస్ట్రేట్ బక్కెర నాగలక్ష్మి విద్యార్థులకు సూచించారు. శనివారం కూసుమంచి మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో ఖమ్మం లీగల్ సెల్ ఆధ్వర్యంలో 8,9,10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్, పోక్సో, డ్రగ్స్, బాల్యవివాహాలు, ఇంకా అనేక చట్టాలగురించి వివరించి, విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో నేడు జరుగుతున్న ప్రతి దాడులు వాటి వెనుక ఉన్న చట్టాలు మహిళలకు, పిల్లలకు, వయస్సుమళ్లినవారికి ఏవిధంగా న్యాయం చేకూర్చేవిధంగా చట్టం రూపొందించబడిందో వివరించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి ఎస్సై నాగరాజు, జిల్లా లీగల్ సెల్ న్యాయవాది దేవరకొండ కళ్యాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, సర్పంచ్ కొండ క్రిష్ణవేణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

*** తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటోల్ల వెంకటస్వామి,**




ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో సంఘ భవనంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా కమిటీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంటొల్ల వెంకటస్వామి మాట్లాడుతూ నిర్మల్ జిల్లా కేంద్రంతోపాటు నిర్మల్ జిల్లాలోని వివిధ మండలాల నుండి ఈనెల 29 న హైదరాబాద్ లోని ఐ అండ్ పి ఆర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని దళిత, గిరిజన జర్నలిస్టులతో పాటు సామాజిక వాదులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. రాష్ట్రంలో అక్రిడిటేషన్ల విషయంలో దళిత, గిరిజన జర్నలిస్టులపై సామాజిక వివక్షను, కుల వివక్షను చూపడంతో కార్డుల పంపిణీలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఇతర సామాజిక వర్గాల ఆధిపత్యం కొనసాగిస్తూ దళిత గిరిజన జర్నలిస్టులను పక్కన పెట్టే విధానాన్ని తక్షణమే విరమించుకోవాలని అర్హులైన ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ముట్టడి కార్యక్రమానికి దళిత, గిరిజన జర్నలిస్టు లు, దళిత గిరిజన సంఘాలు, సామాజిక న్యాయవాదులు తమ మద్దతును ప్రకటించి పెద్ద ఎత్తున పాల్గొని కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ ఎస్టీ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొండ రవి, జిల్లా ఉపాధ్యక్షులు దాస మల్లభాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాగ్మారే కపిల్, జిల్లా కోశాధికారి కడుగొల్ల లచ్చిరాం, సలహాదారులు కారండే గంగాధర్, న్యాయ సలహాదారులు ప్రముఖ న్యాయవాది ఆర్ రత్నం రావ్, న్యాయవాది తిరుక్కోవెల సంపత్ కుమార్ లు, పాల్గొన్నారు.

# ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణపై బీఎల్ఎలతో ఎమ్మెల్యే సమీక్ష



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు పరిరక్షణకు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు , కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వలిగొండలో నిర్వహించిన మండల, పట్టణ బీఎల్ఎల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రతి బూత్‌లో క్షుణ్ణంగా పర్యవేక్షించాలని సూచించారు. జూలై 30న విడుదల కానున్న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో ఎలాంటి లోపాలు లేకుండా ఇప్పటి నుంచే అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు.బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్నందున, కొత్తగా అర్హత పొందిన వారి నమోదు, చిరునామా మార్పులు, ఇతర సవరణల విషయంలో ప్రజలకు పూర్తి సహకారం అందించాలని బీఎల్ఎలకు సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.ఓటర్ల జాబితాలో పేర్లు లేకపోవడం వివరాల్లో పొరపాట్లు లేదా ఇతర లోపాలు గుర్తించిన వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిచేయించాలని, ప్రతి బూత్‌లో పార్టీ నాయకులు, బూత్ కమిటీలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని పేర్కొన్న ఆయన ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత అని అన్నారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న ఆందోళనలను ప్రస్తావిస్తూ, ఇతర రాష్ట్రాల్లో తలెత్తిన వివాదాల తరహా పరిస్థితులు తెలంగాణలో పునరావృతం కాకుండా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు వాకిటి అనంతరెడ్డి వలిగొండ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్ మాజీ ఎంపీపీ నూతిరమేష్ రాజు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి, ఉపసర్పంచ్ మాధవి, కాంగ్రెస్ పార్టీనాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి

*** బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్ధన్ గౌడ్.**




ప్రజాస్ఫూర్తి,నల్లగొండ : బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నల్గొండ జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫీజురీయంబర్స్ మెంట్ విడుదల చేయాలన్నారు.జీవో నెంబర్ 8,9 రద్దు చేసి, పాత పద్ధతిలోనే ఫీజు రీయంబర్స్ మెంట్ అమలు చెయ్యాలి ఇంజనీరింగ్/ఫార్మసీ/పీజీ/డిగ్రీ తదితర కోర్సులు పూర్తయిన వారికి కాలేజీ యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదుఅని,. దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఏ కాలేజికి వెళ్ళి చూసిన విద్యార్థులు ఫీజులు కట్టలేక నరకయాతన అనుభవిస్తుంటే ప్రభుత్వం సంతోషంగా యుందా అని తక్షణమే బకాయిలు చెల్లించాలని మూడు సంవత్సరాల నుండి ఫీజు రియంబర్స్మెంట్ రాక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు.వారి భవిష్యత్తు తో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయక కాలేజీ యజమానులు మెమోలో ఇవ్వకుండా విద్యార్థులని చాలా ఇబ్బందులకు గురిచేస్తున్నారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఖరిని నిరసిస్తూ ఈనెల 30వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కళాశాలలు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బందుకు పిలుపు నివ్వడం జరుగుతుంది దీనికి కళాశాలల యజమానులు అందరూ సహకరించాలని కోరుతున్నాము .మరి ముఖ్యమంత్రి గారు పేద విద్యార్థులకు ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ బీసీ పేద వర్గాల సంబంధించిన విద్యార్థులు చదువుకోకూడదనే దురుద్దేశంతోటే ఫీజు రియంబర్స్మెంట్ ని ఎత్తువేయాలని కుట్ర చేస్తూ ఉన్నాడు దాంట్లో భాగంగానే మూడు సంవత్సరాల నుండి ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకుండా ఆలస్యం చేస్తున్నాడు పేద విద్యార్థుల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే పెండింగ్లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేసి విద్యార్థులని వారి భవిష్యత్తుని కాపాడాల్సిన అవసరం ఉందనే సందర్భంగా తెలియజేస్తా ఉన్నాం లేని ఎడల ఆర .కృష్ణన్న ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రాష్ట్ర ముఖ్యమంత్రి కి హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ఉప్పు లోకేష్, చేకూరి శివ, పొరపాటు కిషోర్, రూపాని చరణ్ కోన్, రెడ్డి మహేష్ రెడ్డి, వడ్లకొండ మనోహర్,కృష్ణ, నగేష్, రామన్న మల్లికార్జున్, వెంకన్న, సురేష్, సతీష్, విజయకుమార్, చెన్నూరు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి నల్గొండ జిల్లా రాక ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి జిల్లా పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి .చంద్రశేఖర్ ,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ లు మరోసారి ఏర్పాట్లను పర్యవేక్షించారు.శనివారం వీరు రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరుకానున్న కనగల్, నల్గొండ ఎన్ .జి. కళాశాల బహిరంగ సభ సంబంధించి కు ఏర్పాట్లను పరిశీలించారు. కనగల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి 13006 కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించనున్న హ్యాం రోడ్లకు శంకుస్థాపన పైలాన్ ను ఆవిష్కరించనున్నారు. అక్కడ నుండి నల్గొండ చేరుకొని నల్గొండ నాగార్జున కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారు.ఈ సందర్భంగా బహిరంగ సభ వద్ద వేదిక ఏర్పాట్లను, అక్కడే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి చేపట్టనున్న తాగునీటి ప్రాజెక్టు శంకుస్థాపన శిలా ఫలకం, సీటింగ్ ,బ్యారికేడ్లు, విఐపి, మహిళలు, ఇతరుల గ్యాలరీలన్నింటిని పరిశీలించారు.ఎన్ జి కళాశాల గ్రౌండ్లో అన్ని ఏర్పాట్లను శనివారం సాయంత్రం లోపు పూర్తి చేయాలని, బహిరంగ సభకు వచ్చే అందరి కోసం తాగునీరు, టాయిలెట్లు, ఎండ తగలకుండా టెంట్ తో పాటు ,వర్షం వచ్చిన తట్టుకునేలా ఏర్పాట్లు అన్నింటిని పూర్తి చేయాలని చెప్పారు.జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నల్గొండ టౌన్ పర్యటన నేపథ్యంలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడం జరుగుతుందని, తిప్పర్తి తదితర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలు పానగల్ రోడ్ మీదుగా, అలాగే దేవరకొండ వైపు నుండి వచ్చే వాహనాలను నల్గొండ రూరల్ పోలీస్ స్టేషన్ వెనుక వైపునుండి, మర్రిగూడా బైపాస్ నుండి వచ్చే వాహనాలను ఎన్జీ కళాశాల వద్ద యూటర్న్ తీసుకుని ప్రజలను దించి వెళ్లేలాగా సవివరంగా మ్యాప్ తయారు చేయడం జరిగిందని, ట్రాఫిక్ రిస్ట్రిక్షన్ ఉంటుందని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో మరోసారి సమావేశమై ఏర్పాట్లను క్షుణ్ణంగా సమీక్షించారు. ఏర్పాట్లలోఎక్కడ జాప్యం లేకుండా, నిర్లక్ష్యం వహించకుండా ఆయా శాఖల అధికారులు వారి ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.అదనపు ఎస్పి రమేష్, రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జెడ్పి సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డి.ఎఫ్ఓ రాజశేఖర్, డిఆర్ఓ దశరథ్, ట్రైనింగ్ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి ,స్థానిక సంస్థల ఇంచార్జ్ ఆప్యానపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు ఉన్నారు.

# కేసుల దర్యాప్తులో నాణ్యతకు పెద్దపీట వేయాలి

*** సాంకేతికతతో సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి**

*** మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు**



మెదక్, ప్రజాస్ఫూర్తి : కేసుల దర్యాప్తులో నాణ్యతకు పెద్దపీట వేస్తూ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు సూచించారు. వార్షిక తనిఖీలలో భాగంగా శనివారం పాపన్నపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించి స్టేషన్ నిర్వహణను సమగ్రంగా తనిఖీ చేశారు.స్టేషన్ ఆవరణ పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, స్వాధీన వాహనాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేసి, దయానంద్ కు రివర్డ్ మంజూరు చేశారు, శాఖ అందించిన సామగ్రిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి పోలీసు సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి పట్టు సాధించి అన్ని రకాల విధుల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. ప్రస్తుతం నేర్చుకుంటున్న అంశాలు సేవా కాలమంతా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. స్టేషన్ రికార్డులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు.ఈ తనిఖీలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు రాజా శేఖర్ రెడ్డి, కృష్ణమూర్తి, సందీప్ రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామ్ చందర్ రావు ని కలిసిన జే.కె.శేఖర్ యాదవ్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులుగా నియమితులైన జె.కె.శేఖర్ యాదవ్ శనివారం తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామ్ చందర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ను, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్లను వేరువేరుగా మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం వారిని శాలువా కప్పి సత్కరించారు. అనంతరం వారు జే.కె.శేఖర్ యాదవ్ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అందరి ఐక్యతకు ముఖ్యపాత్ర వహించాలని సూచించారు. శేఖర్ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించిన ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్రరావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, రావుల శేషగిరి రావు, మేకల సురేష్ రెడ్డి, కట్ట కుమార్, సిద్ధిరామిరెడ్డి, యాదగిరి యాదవ్, సుబ్బారావు, మల్లేష్, ఆర్తిక్ యాదవ్, గండి రాజు యాదవ్, కుమార్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, పలువురు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి సర్కారు పెద్దపీట

*** రూ.2.25 కోట్లతో గురుకుల కళాశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

ప్రజా స్ఫూర్తి, పాలేరు : రాష్ట్రంలో విద్యారంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, ప్రభుత్వ విద్యాసంస్థల్లో కార్పొరేట్ స్థాయి మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఖమ్మం రూరల్ పరిధిలోని దానవాయిగూడెం టి జి ఎస్ డబ్ల్యు ఆర్ ఐ ఈ ఎస్ బాలికల జూనియర్ కళాశాలలో రూ.2.25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, మరమత్తుల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ. ప్రభుత్వ గురుకులాల్లో చదువుకునే పేద కుటుంబాల విద్యార్థులకు అత్యుత్తమ బోధనతో పాటు అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాధారణంగా పరిపాలనా అనుమతులు వచ్చినా పనులు ప్రారంభం కావడానికి, పూర్తి కావడానికి ఏళ్ల సమయం పడుతుందని.. కానీ, ఈ



కళాశాలలో అధికారులు, ప్రిన్సిపాల్ విజయదుర్గ సమన్వయంతో పనులను వేగవంతం చేయడం అభినందనీయమన్నారు. పాఠశాలను తమ సొంత ఇంటిలా భావించి అభివృద్ధికి శ్రమిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

*** ఊటవాగు తండా వద్ద చెక్‌డ్యాం నిర్మాణానికి శంకుస్థాపన..**

అనంతరం ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు, తీర్థాల గ్రామాల సమీపంలోని ఊటవాగు తండా వద్ద రూ.6.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న చెక్ డామ్ పనులకు మంత్రి పొంగులేటి భూమిపూజ చేశారు. ఈ ప్రాంత రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఈఈ బషీర్, కళాశాల ప్రిన్సిపాల్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 14వేల విష గుళికల పంపిణీకి పన్నాగం.. భారీ కుట్ర భగ్నం

ముంబయిలో అతిపెద్ద కుట్రను పోలీసులు భగ్నం చేశారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ఓ వ్యక్తి ప్రజలకు విష గుళికలు పంపిణీ చేయడానికి ప్రయత్నిస్తుండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద ఎలుకల మందు కలిపిన 14,900 క్యాప్సూల్స్ ను స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జయంత్ మీనా తెలిపిన వివరాల ప్రకారం.. మొహర్రం ఊరేగింపులో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడని, అక్కడి ప్రజలకు క్యాప్సూల్స్ పంచి పెడుతున్నట్టుగా సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు



నిందితుడు గుళికలు పంచుతుండగా అదుపులోకి తీసుకున్నారు. మొహర్రం ఊరేగింపును లక్ష్యంగా చేసుకొని ఈ కుట్ర పన్నినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని పుణెకు చెందిన ఫయాజ్‌గా గుర్తించారు. కొన్ని రోజుల క్రితం అతడు 50కిలో గ్రాముల జింక్ ఫాస్ఫైడ్‌ను ఆర్డర్ చేసి.. ఒక్కో క్యాప్సూల్‌లో ఒక గ్రాము విషాన్ని నింపినట్లు తెలిపారు. అతడు గతేడాది ఇరాన్, ఇరాక్‌లకు వెళ్లి వచ్చినట్లు దర్యాప్తులో తేలిందన్నారు. ఈ ఘటన వెనుక ఉగ్ర కుట్ర ఉండి ఉంటుందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుడు ఇచ్చిన గుళికను మింగడం వల్ల ఓ వ్యక్తి అనారోగ్యానికి గురయ్యాడని.. ప్రస్తుతం అతడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు.

## ఇంకేమైనా పరీక్షలు.. మిగిలున్నాయా?: పేపర్ లీక్‌లపై విపక్షాలు ధ్వజం

మహారాష్ట్రలోని భీవండిలో టెట్ ప్రశ్నపత్రం లీక్ అయిన ఘటనపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. పేపర్ లీకేజీ అనేది ఇకపై ఎప్పుడో ఒకసారి జరిగే తప్పిదం కాదని.. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి ఒక గుర్తింపుగా మారిందని కాంగ్రెస్ దుయ్యబట్టింది. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే కంచుకోటగా ఉన్న ఠాణేలో ఈ ఘటన జరగడం ఆందోళనకరమని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్ అన్నారు. లక్షలాది మంది విద్యార్థుల కఠోర శ్రమ, భవిష్యత్తును నాశనం చేస్తున్న ఈ లీకుల ముఠాలకు ఏ నాయకుడు అండగా ఉన్నాడని ప్రశ్నించారు. టెక్ పేపర్ లీక్‌పై నిష్పక్షపాత విచారణ జరపాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో పేపర్ లీక్‌లు కాని పరీక్షలు ఇంకా ఏమైనా ఉన్నాయా అని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. టెట్ పేపర్ లీక్ చేసిన నిందితులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ నియామక పరీక్షల పేపర్లే లీక్ అవుతుంటే.. ఇక ఏ పరీక్షా సురక్షితం కాదని



ఎన్సీపీ (ఎస్పీ) అధికార ప్రతినిధి అమోల్ అసహనం వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు వెలుగులోకి వచ్చినప్పటికీ.. ఏమాత్రం చలనం లేని ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆరోపించారు. దేవాలయాలు, పరీక్షలు అనే తేడా లేకుండా భాజపా నేతలు అన్ని చోట్లా చోరీలకు పాల్పడుతున్నారని ఆప్ అధినేత కేజ్రీవాల్ మండిపడ్డారు. ప్రభుత్వంలోని కీలక నేతల ప్రమేయం లేకుండా ఇంత భారీ స్థాయిలో పేపర్ లీక్‌లు జరగడం అసాధ్యమని అన్నారు. దీనివెనక ఉన్నవారికి తగిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. నీట్ యూజీ పేపర్ లీక్ విషయంలో మహారాష్ట్ర కూడా ఓ కేంద్రంగా ఉన్నప్పటికీ.. ఆ తప్పు నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏమీ నేర్చుకోలేదని శివసేన (యూబీటీ) నేత అంబదాస్ విమర్శించారు. టెట్ వంటి ఒక చిన్న పరీక్షను కూడా ప్రభుత్వం సరిగా నిర్వహించలేకపోయిందని దుయ్యబట్టారు.

## సీఎం గారూ 12 శాఖలు మీ వద్దేనా? చిక్కుల్లో పడతారు జాగ్రత్త!

ఉజ్జయిని: తన వద్ద 12 శాఖలను పెట్టుకుని మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ చాలా పెద్ద తప్పు చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఏదో ఒకరోజు అధికారులు ఎవరైనా అక్రమాలకు పాల్పడితే ఆయనే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. భూ కొనుగోలు విషయంపై ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మాజీ సీఎం ఇలా స్పందించారు. 'మోహన్ యాదవ్ జీ.. మీ వద్దే 12 శాఖలు పెట్టుకున్నారు. మీరు చాలా పెద్ద పొరపాటు చేస్తున్నారు. ఇబ్బందుల్లో పడతారు. ఏ ఒక్క అధికారి తప్పు చేసినా, అక్రమాలకు పాల్పడినా.. చివరికి మీరే చిక్కుల్లో పడతారు. నేను మధ్యప్రదేశ్‌కు పదేళ్లపాటు



ముఖ్యమంత్రిగా సేవలందించా. నాపై ఒక్క ఆరోపణ కూడా రాలేదు. ఎందుకంటే ఏ ఒక్క శాఖ కూడా నావద్ద పెట్టుకోలేదు. గతంలో శివరాజ్‌సింగ్ చౌహాన్ హయాంలో నా ఫైల్స్ అన్నీ పరిశీలించినా.. నాకు వ్యతిరేకంగా ఏమీ దొరకలేదు. కావాలంటే ఇప్పుడు మీరు నాపై విచారణ చేయించండి. భూ కుంభకోణంలో ఏయే కంపెనీల ప్రమేయం ఉందో నేనూ అధ్యయనం చేస్తున్నా. మమ్మల్ని కొనుగోలు చేస్తామని అనుకోవద్దు. మేం అమ్ముడు పోవడానికి సిద్ధంగా లేం. ఎవరెవరైతే అమ్ముడు పోయారో వాళ్లు ఇప్పటికే భాజపాలో చేరారు. న్యాయం కోసం పోరాటం చేసేందుకు కాంగ్రెస్ నాయకులందరం సిద్ధంగా ఉన్నాం' అని దిగ్విజయ్ సింగ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం నిర్వర్తిస్తున్న శాఖలపైనా దిగ్విజయ్ విమర్శలు గుప్పించారు. హోం, జైళ్లు, ప్రజా సంబంధాలు, నర్మదా వ్యాలీ డెవలప్‌మెంట్, ఏవియేషన్ సహా మొత్తంగా 12 శాఖలను ముఖ్యమంత్రి వద్దే ఉంచుకోవడం పెద్ద తప్పిదమేనన్నారు. భవిష్యత్తులో ఆయనకు చిక్కులు తప్పవని హెచ్చరించారు.

## ఇంధన ధరలు ఎందుకు తగ్గట్లేదు? : ఖర్గే

ముడి చమురు ధరలు తగ్గి పశ్చిమాసియా యుద్ధానికి ముందు స్థాయికి చేరుకున్నా, భారత్‌లో ఇంధన ధరలు ఎందుకు అధికంగా ఉన్నాయని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భాజపా ప్రజలను దోచుకుంటోందని.. జేబులను ఖాళీ చేస్తోందని ఆరోపించారు. ప్రజల్ని కేవలం పన్నుల వసూలు సాధనంగా మాత్రమే చూస్తోందంటూ మండిపడ్డారు. యుద్ధాన్ని కారణంగా చూపి కేంద్ర ప్రభుత్వం వాణిజ్య ఎల్పీజీ ధరలను రెట్టింపు చేసిందని.. ఇప్పుడు సరఫరా సాధారణ స్థితికి వచ్చినా ధరలను ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. "పశ్చిమాసియాలో యుద్ధం ఉద్ధృతంగా ఉన్నప్పుడు ముడి చమురు ధర బ్యారెల్‌కు 138 డాలర్లుగా ఉండేది. అప్పట్లో పెట్రోల్ లీటరు ధర రూ.94.77, డీజిల్ రూ.87.67గా ఉంది. కానీ, ప్రస్తుతం క్రూడ్



ఆయిల్ బ్యారెల్ 70 డాలర్లకు పడిపోయింది. అయినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరలను మోదీ ప్రభుత్వం ఎందుకు తగ్గించడం లేదు?" అని ఖర్గే నిలదీశారు. యుద్ధం పేరుతో వాణిజ్య ఎల్పీజీ ధరలను రెట్టింపు చేశారని, ఇప్పుడు సరఫరా సాధారణ స్థితికి చేరినా ప్రజలకు ఎందుకు ఉపశమనం కలిగించడం లేదని ప్రశ్నించారు. వలస కార్మికులకు ఉపయోగకరమైన ఐదు కిలోల సిలిండర్ల ధరలనూ విపరీతంగా పెంచేశారని ఆక్షేపించారు.

## ఇల్లు అప్పగింత ఆలస్యమైతే.. పరిహారం కోరవచ్చు: సుప్రీం

ఫ్లాట్ కొనుగోలు చేసిన తర్వాత కూడా ఆలస్యానికి పరిహారం కోరే హక్కు కొనుగోలుదారులకు ఉంటుందని సుప్రీం కోర్టు వెల్లడించింది. ఇల్లు కొన్న తర్వాత.. రియల్ ఎస్టేట్ కంపెనీల వైఫల్యానికి వ్యతిరేకంగా ఫిర్యాదు చేసే హక్కు ఉండదని భావించడం సరికాదని పేర్కొంది. ఈ మేరకు నేషనల్ కన్స్యూమర్ డిస్ప్యూట్ రీడ్రెసల్ కమిషన్ ఇచ్చిన 2016 నాటి ఉత్తర్వులను పక్కనబెట్టింది. దిల్లీలోని ఓ కోఆపరేటివ్ గ్రూప్ హౌసింగ్ సొసైటీలో 2003లో సభ్యుడిగా చేరి.. ఫ్లాట్ కొనుగోలు చేసిన వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఫ్లాట్ స్వాధీనం విషయంలో ఎటువంటి అభ్యంతరం లేకుండానే దానిని తీసుకున్నందున.. ఫిర్యాదు దాఖలు చేసే సమయానికి సదరు వ్యక్తి 'వినియోగదారుడు' కాదనే జాతీయ కమిషన్ వాదనను సుప్రీం కోర్టు తప్పుబట్టింది. గృహ కొనుగోలుదారు తనకు కలిగిన అసౌకర్యానికి వినియోగదారుల ఫోరమ్‌కు ఫిర్యాదు చేయకుండా రియల్ ఎస్టేట్ కంపెనీతో చేసుకున్న ఒప్పందంలోని మధ్యవర్తిత్వ నిబంధన అడ్డుకోలేదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఫిర్యాదు దాఖలు చేయడానికి ముందే ఇంటిని స్వాధీనం చేసుకున్నారనే కారణంతో పిటిషనర్ 'వినియోగదారు' హోదాను కోల్పోయారని భావించకూడదని జాతీయ కమిషన్ కు సూచించింది. వస్తువులు లోపం లేదా



సేవలలో లోపం గురించి ఫిర్యాదు చేయడానికి వినియోగదారులు 'వినియోగదారుల రక్షణ చట్టం (1986) భరోసా పొందాలని సుప్రీం కోర్టు సూచించింది. వినియోగదారులకు వేగవంతమైన పరిష్కారాన్ని అందించడమే లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు తెలిపింది.



## హర్మూజ్‌లో మరో ట్యాంకర్‌పై క్షిపణి దాడి

అమెరికా ఇరాన్‌ల ప్రతీకార దాడులతో హర్మూజ్‌లో మరోసారి ఉద్రిక్తతలు నెలకొంటున్నాయి. తాజాగా జలసంధిలో ప్రయాణిస్తున్న ఓ ట్యాంకర్‌ను క్షిపణి తాకినట్లు యూకే మిలిటరీ వెల్లడించింది. ఆ నౌకకు నష్టం వాటిల్లినప్పటికీ.. సిబ్బంది అందరూ సురక్షితంగా ఉన్నారని పేర్కొంది. అయితే ఆ క్షిపణిని ఎవరు ప్రయోగించారనే విషయంపై స్పష్టత రాలేదు. అమెరికా ఇరాన్‌లు శాంతి ఒప్పందంపై సంతకాలు చేయడంతో హర్మూజ్‌లో ఇటీవల నౌకాయానం తిరిగి ప్రారంభమైంది. కొన్ని నెలలుగా అక్కడే నిలిచిపోయిన అనేక వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని మొదలుపెట్టాయి. ఈ క్రమంలోనే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ అమెరికా, ఇరాన్‌లు దాడులను మొదలుపెట్టాయి. డ్రోన్లు, క్షిపణి దాడులతో జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## డ్రగ్స్ కాదు.. అది మెడిసిన్: వివాదంలో తమిళనాడు మంత్రి

తమిళనాడు మానవవనరుల శాఖమంత్రి డి.శరత్‌కుమార్ వివాదంలో చిక్కుకున్నారు. ఆయన వద్ద డ్రగ్స్ ఉన్నాయంటూ ఆరోపణలు వచ్చాయి. కొన్నేళ్ల క్రితం నాటి వీడియో వైరల్ కావడంతో ఈ విమర్శలు వ్యక్తంకాగా.. అది మెడిసిన్ అంటూ మంత్రి వివరణ ఇచ్చుకున్నారు. తొలిసారి ఎమ్మెల్యే అయిన శరత్‌కుమార్‌కు టీవీకే ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కింది. ఇప్పుడు ఆయనపై డ్రగ్స్ ఆరోపణలు వచ్చాయి. మొబైల్ ఫోన్ స్క్రీన్‌పై ఒక తెల్లని పదార్థాన్ని ఉంచి, ఏటీఎం కార్డుతో పొడి చేస్తున్నట్లుగా ఆ దృశ్యాల్లో కనిపించింది. ఆయన



అప్పుడు ఐపీఎల్ మ్యాచ్ చూస్తున్నారు. పక్కనే రూ.500 నోటు కూడా ఉంది. తన సన్నిహితులకు మాత్రమే కనిపించేలా 'థగ్ లైఫ్' పేరుతో కొన్ని సంవత్సరాల క్రితం ఇన్‌స్టా స్టోరీలో దానిని షేర్ చేశారు. 'స్టార్ట్ రన్, స్టాప్ డ్రగ్' పేరిట మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా నిర్వహించిన మారథాన్‌లో సీఎం విజయ్ పాల్గొన్న రోజే ఈ వీడియో వెలుగులోకి రావడం గమనార్హం. దీంతో మంత్రి డ్రగ్స్ వాడారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆయన రాజీనామా చేయాలంటూ పలువురు డిమాండ్ చేశారు. దీంతో శరత్ కుమార్ స్పందించారు. తన భార్య, చిన్న కుమార్తెతో కలిసి ఉన్న ఒక వీడియోను షేర్ చేసి, వివరణ ఇచ్చుకున్నారు. "చెన్నైలోని చెపాక్ స్టేడియంలో రెండేళ్ల క్రితం ఐపీఎల్ మ్యాచ్‌కు హాజరయ్యాను. నా కుటుంబం, స్నేహితులతో కలిసి మ్యాచ్‌కు వెళ్లాను. అప్పుడు నా కుమార్తె వయసు ఏడాదిన్నర. ఆరోజు మా పాప కాస్త అనారోగ్యంగా ఉండటంతో.. లిక్విడ్‌లో కలిపి ఇచ్చేందుకు ట్యాబ్లెట్‌ను పౌడర్ చేశాను. డాక్టర్ సలహా మేరకే మేం అలా చేశాం. దురుద్దేశంతో అప్పటి వీడియోను ఇప్పుడు వైరల్ చేస్తున్నారు" అని పేర్కొన్నారు. "ముఖ్యమంత్రి విజయ్ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ముందుకువెళ్తున్నారు. ఇప్పుడు తన మంత్రిపై వ్యక్తమవుతోన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఆయనపై లేదా..? ప్రజల్లో అనుమానాలను అలాగే వదిలేయకూడదు" అని డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై ఎక్స్ వేదికగా వ్యాఖ్యలు చేశారు.



# గూఢచారి-2లో పవర్‌ఫుల్ రోల్

క్షణం మూవీ తర్వాత పదేళ్ల గ్యాప్ అనంతరం మరోసారి అడివిశేష్ సినిమాలో అనసూయ నటించబోతుంది. గూఢచారి సినిమాకు సీక్వెల్ గా వస్తున్న గూఢచారి 2లో ఆమె నటించనుందట. గోవాలో జరిగిన డిస్కష న్స్‌లో ఆమె పాల్గొన్న ఫొటోలను అడివిశేష్ సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు.





# అక్టోబర్‌లో ఆదర్శ కుటుంబం



వెంకటేష్ ఆదర్శ కుటుంబం మూవీ రిలీజ్ డేట్ ఫిక్సయ్యింది. ఈ పోస్ట్‌పోన్ రూమర్లకు మేకర్స్ చెక్‌పెట్టారు. అఫీషియల్‌గా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను శనివారం ప్రకటించారు. అక్టోబర్ 2న ఆదర్శ కుటుంబం థియేటర్లలోకి రానున్నట్లు వెల్లడించారు. విడుదల తేదీతో పాటు స్పెషల్ పోస్టర్‌ను అభిమానులతో పంచుకున్నారు మేకర్స్. ఈ పోస్టర్‌లో వెంకటేష్, శ్రీనిధి శెట్టి భార్యాభర్తలుగా సింపుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. వారి వెనుక ఇద్దరు పిల్లలు ఉండటం ఆసక్తిని పంచుతోంది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా రూపొందనున్నట్లు పోస్టర్ ద్వారా మేకర్స్ హింట్ ఇచ్చేశారు. తమన్ మ్యూజిక్ అందిస్తుండగా త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్నారు. హారిక హాసిని క్రియేషన్స్ పతాకంపై చినబాబు నిర్మిస్తున్నారు.

సినిమా

# బన్నీతో మూడోసారి..

అల్లు అర్జున్, రష్మిక మందన్న ముచ్చటగా మూడోసారి జోడీ కట్టబోతున్నారు. కోలీవుడ్ సెన్సేషన్ అట్లీ డైరెక్షన్‌లో రాకా పేరుతో ఓ పాన్ ఇండియన్ మూవీ తెరకెక్కుతోంది. ఇందులో రష్మిక నటించనున్నది. జూలై సెకండ్ వీక్ నుంచి సెట్స్‌లో నేషనల్ క్రష్ అడుగుపెట్టబోతుంది. ఆమె రోల్ డిఫరెంట్‌గా ఉంటుందట. హ్యూమర్, సూపర్ పవర్స్ కలబోసిన అమ్మాయిగా రష్మిక కనిపించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. రష్మిక నటించే విషయాన్ని మేకర్స్ ఓ స్పెషల్ వీడియో గ్లింప్స్ ద్వారా అఫీషియల్‌గా ప్రకటించబోతున్నట్లు సమాచారం. ఈ మూవీని సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.



# మూగబోయిన సినీ స్వరం

## గుండెపోటుతో తమిళ దిగ్గజ దర్శకుడు భాగ్యరాజ్ కన్నుమూత

**భారతీరాజా మరణం మరువకముందే తమిళ సినీ పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. సీనియర్ హీరో, దర్శకుడు కే భాగ్యరాజ్ (73) శనివారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూశారు. సుదీర్ఘ సినీ ప్రయాణంలో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా 75 సినిమాల్లో నటించారు. 25 సినిమాలకు దర్శకత్వం వహించారు. నటుడిగా, దర్శకుడిగా తమిళంలోనే కాకుండా తెలుగు, హిందీ భాషల్లో సినిమాలు తీసి చెరగని ముద్ర వేసుకున్నారు.**



**భారతీరాజా అసిస్టెంట్‌గా సినీ ప్రయాణం...**
లెజెండరీ డైరెక్టర్ భారతీరాజా వద్ద అసిస్టెంట్‌గా భాగ్యరాజ్ సినీ ప్రయాణం మొదలైంది. భారతీరాజా దర్శకత్వం వహించిన పదహారు వయనిథిలే, కిళక్కే పోగుమ్ రైల్, సిగప్పు రోజాక్కల్ సినిమాలకు భాగ్యరాజ్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాడు. 1979లో భారతీరాజా దర్శకత్వంలో వచ్చిన పుదియ వార్పుగళ్ సినిమాతో హీరోగా పరిచయమయ్యారు. ఈ మూవీకి కథ, డైలాగ్స్ స్వయంగా అందించారు. తొలి సినిమాతోనే బెస్ట్ డైలాగ్ రైటర్‌గా రాష్ట్ర ప్రభుత్వ అవార్డ్ అందుకున్నారు. 1979లోనే దర్శకుడిగా అరంగేట్రం చేస్తూ సువరిల్లాద చిత్రాంగళ్ అనే సినిమాను తెరకెక్కించారు.



**తెలుగులో రీమేక్..**
భాగ్యరాజా దర్శకత్వం వహించిన సువరిల్లద చిత్రాంగళ్ (పేదల బ్రతుకులు), ఒరు కాయ్ ఒసై (ప్రణయగీతం), మౌన గీతాంజల్ (సత్యభామ), అంధ 7 నాటక్కల్ (రాధా కళ్యాణం), ముంధానై ముడిచ్చు (మూడుముళ్లు), ఎంగ చిన్న రాసా (అబ్బాయిగారు) తో పాటు మరికొన్ని సినిమాలు తెలుగులో రీమేక్ అయ్యాయి. చిలిపి పెళ్లాం, మీ ఇంటికొస్తే ఏం ఇస్తారు.. మా ఇంటికొస్తే ఏం తెస్తారు, మేం వయసుకు వచ్చాం వంటి తెలుగు సినిమాల్లో నటించారు. ఇదిలా ఉండగా సమాజంలోని వివక్ష, కట్టుబాట్లకు వినోదాన్ని జోడించి చెప్పడం భాగ్యరాజ్ సినిమాలతోనే మొదలైంది. స్క్రీన్ ప్లే కింగ్‌గా పేరు పొందారు. ఇప్పటికీ ఆయన స్క్రీన్‌ప్లేను నేటితరం దర్శకులు చాలా మంది రిఫరెన్స్‌లుగా వాడుతుంటారు.



**పేరు తెచ్చిన సినిమాలు..**
అంతు 7 నాట్కల్, ముంధానై ముడిచ్చు, మౌన గీతాంజల్, చిన్నవీడు, ఒరు కైదియన్ డైరీ, డార్లింగ్ డార్లింగ్ డార్లింగ్, ఇదు నమ్మభూమితో పాటు పలు సినిమాలతో దర్శకుడిగా, నటుడిగా దక్షిణాది ప్రేక్షకులను మెప్పించారు. రజనీకాంత్, కమల్‌హాసన్, అమితాబ్‌బచ్చన్‌తో పాటు పలువురు దిగ్గజ నటులతో సినిమాలు చేశారు. దర్శకుడిగా చివరగా సిద్ధు ప్లస్ 2 అనే సినిమా చేశారు. నటుడిగా చివరగా తెలుగు మూవీ కుబేరలో కనిపించాడు. మగధీర తమిళంలోకి మావీరన్ పేరుతో డబ్ అవగా భాగ్యరాజ్ డైలాగ్స్ అందించారు.

**ప్రేమ పెళ్లి..**
1970– 80 దశకంలో తమిళం, మలయాళ భాషల్లో టాప్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ప్రవీణను ప్రేమ వివాహం చేసుకున్నారు. అనారోగ్యంతో ఆమె కన్నుమూయగా మరో హీరోయిన్ పూర్ణిమ జయరామ్‌తో ఏడడుగులు వేశారు. వీరికి ఓ కొడుకుతో పాటు కూతురు జన్మించారు. కాగా గురువారం జరిగిన ఖుష్బూ కూతురు అవంతిక పెళ్లికి భాగ్యరాజ్ అటెండ్ అయ్యారు. ఈ పెళ్లి ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.